అచల గురుమాతాజీ సమేత అచల గురూజీ
వారి అఖండ పరిపూర్ణ ఆశీస్సులతో



సత్య దీపిక ఉదయం

తెలుగు దినపత్రిక



ప్రచురణ : అమలాపురం | సంపుటి : 01 | సంచిక : 135 | ఆదివారం 22-11-2026 | ఎడిటర్: ఎస్.ఎస్ రావు | పేజీలు : 04 | వెల : 3-00

నారా దుశ్శాసనుడి చేతిలో ప్రజాస్వామ్యానికి వస్త్రాపహరణం



- స్థానిక సంస్థల ఎన్నికల్లో రిగ్గింగ్‌తో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు
- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు
- మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో అక్రమాలు
- నామినేషన్లు వేయనీయకుండా అడ్డంకులు.. వేసిన నామినేషన్లు సైతం

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

- ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలి
- గుర్తింపు కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు
- కమిటీ చైర్మన్ కే. కేశవరావు అధ్యక్షతన భేటీ
- మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో సమావేశం

2లో





మహిళల భద్రతకు రూ.30 లక్షల విరాళం అందించిన శ్రీ కార్తికేయ ఫార్మా

- శ్రీ కార్తికేయ ఫార్మా ఉదార సహకారం
- హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ మహిళా ఫోరమ్‌కు విరాళం
- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ మహేష్ మురళీధర్ భగవత్ ఆధ్వర్యంలో భద్రతా కార్యక్రమాలు
- ప్రజా-ప్రైవేటు భాగస్వామ్యంతో నగర భద్రతకు ప్రోత్సాహం

కూటమి ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలి

-గవర్నర్‌కు వైయస్సార్సీపీ వినతి



- స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమాలు, దౌర్జన్యాలపై గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేశారు
- పోలీసులను, అధికారులను అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు
- ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై ఆధారాలతో గవర్నర్‌కు వినతిపత్రం
- రాష్ట్రపతికి, పార్లమెంట్‌కు ప్రభుత్వ రద్దు సిఫారసు చేయాలని విజ్ఞప్తి
- తాడిపత్రి, కడప, పుంగనూరులో దాడులు.. పెట్రోల్ బాంబులతో దౌర్జన్యాలు
- నామినేషన్ నుంచి కౌంటింగ్ వరకు అడుగడుగునా అక్రమాలే
- ఎన్నికలను రద్దు చేసి మళ్లీ న్యాయబద్ధంగా నిర్వహించాలి
- డీజీపీ విధులు కూడా చంద్రబాబు, లోకేష్ నిర్వహిస్తున్నారంటూ బొత్స విమర్శలు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన కూటమి ప్రభుత్వం
- 92 శాతం స్ట్రైక్ రేట్‌పై బొత్స వ్యంగ్యాస్త్రాలు
- గవర్నర్ సానుకూలంగా స్పందిస్తారని ఆశాభావం

అమరావతి క్వాంటం వ్యాలీలో సరికొత్త అధ్యాయం

-రాష్ట్రానికి 'నీలిట్' డీమ్డ్ టు బి యూనివర్సిటీ
-ప్రపంచలోనే తొలి క్వాంటం, ఏఐ వర్సిటీ ప్రత్యేక క్యాంపస్
-ఆచార్య నాగార్జునలో తాత్కాలిక తరగతులు ప్రారంభం
-త్వరలో రూ.730 కోట్లతో రాజధానిలో శాశ్వత క్యాంపస్

కొత్తగా 2లో

- రూ.47 కోట్లతో నాలుగు అత్యాధునిక సాంకేతిక ప్రయోగశాలల ఏర్పాటు
- క్వాంటం కంప్యూటింగ్, కమ్యూనికేషన్, చిప్ డిజైన్, ఏఐ ల్యాబ్‌లు
- వచ్చే జనవరి నుంచి పది అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభం
- అదనంగా 16 స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి కోర్సులు
- రాష్ట్రవ్యాప్తంగా కళాశాల అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు
- యువతకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రాక్టికల్ శిక్షణ
- అమరావతిలో 8.5 ఎకరాల్లో శాశ్వత క్యాంపస్ నిర్మాణం
- శాశ్వత క్యాంపస్ కోసం రూ.730.70 కోట్ల పెట్టుబడి
- క్వాంటం, ఏఐ రంగాల్లో నిపుణుల తయారీకి ప్రత్యేక కార్యాచరణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో విద్యా, సాంకేతిక రంగాల్లో కొత్త అవకాశాలు

మిగతా 2లో



అమరావతి, **సత్యదీపిక ఉదయం**

క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా మరో కీలక ముందడుగు పడింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డీమ్డ్ టు బి యూనివర్సిటీ, అమరావతి తాత్కాలిక క్యాంపస్‌ను శనివారం గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని సీడీఈ భవనంలో ప్రారంభమైంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆర్థిక సలహాదారు డాక్టర్ ఎ.



పులి కదలికలపై నిరంతర నిఘా

- ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చర్యలు చేపట్టాలి
- అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేక రెస్క్యూ బృందాలను రప్పించండి
- పులిని సురక్షితంగా పట్టుకునేలా చర్యలు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

2 లో

- ఆంధ్రప్రదేశ్‌లో నీలిట్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ క్యాంపస్ ప్రారంభం
- ప్రపంచంలోనే క్వాంటం కంప్యూటింగ్, ఏఐ రంగాలకు ప్రత్యేక తొలి విశ్వవిద్యాలయ క్యాంపస్
- గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో తాత్కాలిక క్యాంపస్ ప్రారంభం
- కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నీలిట్ విద్యా సంస్థ ఏర్పాటు
- క్యాంపస్‌ను ప్రారంభించిన కేంద్ర ఐటీ శాఖ ఆర్థిక సలహాదారు డాక్టర్ ఎ. ప్రతిభ
- కార్యక్రమంలో పాల్గొన్న నీలిట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి

ఎన్నికల్లో అద్భుతమైన తీర్పు ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు

-సంక్షేమం, అభివృద్ధికి ప్రజల ఆమోదం
-వైసీపీ డ్రామాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదు
-సామాన్య కార్యకర్తలు, విద్యావంతులకే జెడ్పీ పీఠాలు
-సీఎం చంద్రబాబు



అమరావతి,**సత్యదీపిక ఉదయం** జడ్పీ మండల ప్రజా పరిషత్ ఎన్నికల్లో అద్భుతమైన తీర్పు ఇచ్చిన ప్రజలకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చంద్రబాబు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అండగా నిలిచారన్న సీఎం చంద్రబాబుజిల్లా పరిషత్ ఎన్నికల్లో 96.42 శాతం స్ట్రయిక్ రేట్ సాధించినట్లు వెల్లడి సామాన్య కార్యకర్తలు, మహిళలకు పదవుల్లో అధిక ప్రాధాన్యం వైసీపీ కుట్రలను ప్రజలు తిప్పికొట్టారన్నముఖ్యమంత్రిప్రజాప్రతినిధుల పనితీరు ఆధారంగా తగిన చర్యలు ఉంటాయని స్పష్టీకరణ స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ పన్నిన కుట్రలు, కుతంత్రాలను ప్రజాస్వామ్యబద్ధంగా తిప్పికొట్టిన రాష్ట్ర ఓటర్లకు హ్యాట్సాఫ్ చెబుతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. స్థానిక సంస్థల

మిగతా 2లో

మత్స్యకారులకు భరోసా



-గంగపుత్రుల సంక్షేమానికి పెద్దపీట
-మత్స్యకారుల సేవలో పథకం ద్వారా 1.34 లక్షల కుటుంబాలకు సాయం
-జీవో 217 రద్దుతో మత్స్యకార సహకార సంఘాల హక్కులకు రక్షణ
-ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే
-ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రూ.2,328.89 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు

కాంగ్రెస్‌కు రాజీనామా..

2లో

- ప్రవీణ్, శ్రీనాథ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు
- అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరేందుకు నేతల నిర్ణయం
- ఖైరతాబాద్, సోమాజిగూడ నుంచి ర్యాలీల ప్రారంభం
- జెండా ఊపి ర్యాలీలను ప్రారంభించిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



అమరావతి క్వాంటం వ్యాలీలో సరికొత్త అధ్యాయం

ప్రతిభ ఈ క్యాంపస్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నీలిట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి పాల్గొన్నారు. ఇది ప్రపంచంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తొలి విశ్వవిద్యాలయ క్యాంపస్‌గా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మద్దతుతో అమరావతిలో నీలిట్ ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తోంది. అమరావతి క్వాంటం వ్యాలీలో నైపుణ్యాభివృద్ధికి ఈ విశ్వవిద్యాలయం కేంద్రంగా నిలవడంతో పాటు, అత్యాధునిక సాంకేతిక రంగాలకు అవసరమైన నిపుణులను తయారు చేయనుంది. శాశ్వత క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఇది కార్యకలాపాలు నిర్వహిస్తుంది. తద్వారా కొత్త భవనాల నిర్మాణం కోసం వేచి చూడకుండా రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, శిక్షణ వెంటనే అందుబాటులోకి వచ్చింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో క్యాంపస్:

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి కలిగిన శాస్త్రీయ సంస్థ నీలిట్‌కు 'ఇన్‌స్టిట్యూషన్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ (డిస్టింక్ట్ కేటగిరీ)' హోదా లభించింది. కేంద్ర పరిధిలో ఉన్న ఏకైక విశ్వవిద్యాలయం ఇదే. పంజాబ్‌లోని రూపార్‌లో ప్రధాన క్యాంపస్ ఉండగా, దేశవ్యాప్తంగా 11 అనుబంధ క్యాంపస్‌లు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వేగవంతమైన భాగస్వామ్యంతో అమరావతి క్యాంపస్ ఏర్పాటు సాధ్యమైంది. 2026 ఫిబ్రవరి 20న న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నీలిట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఒప్పందం కుదిరిన తొమ్మిది నెలల్లోనే క్యాంపస్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. మొదటి దశలో భాగంగా తాత్కాలిక క్యాంపస్‌లో రూ.47 కోట్ల వ్యయంతో నాలుగు అత్యాధునిక ప్రయోగశాలలను నీలిట్ ఏర్పాటు చేస్తోంది. క్వాంటం కంప్యూటింగ్ ల్యాబ్, క్వాంటం కమ్యూనికేషన్ ల్యాబ్, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ ల్యాబ్, ఎఐ, కంప్యూటింగ్ ల్యాబ్ అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ ప్రయోగశాలల ద్వారా ప్రపంచంలోని ప్రముఖ టెక్నాలజీ సంస్థలు ఉపయోగిస్తున్న అత్యాధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. వీటి ద్వారా విద్యార్థులకు ప్రాథమిక పరిజ్ఞానంతో పాటు అధునాతన సాంకేతిక నైపుణ్యాలు, ప్రాక్టికల్ అనుభవం కల్పిస్తారు. క్వాంటం, ఎఐ, అనుబంధ సాంకేతిక రంగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా తాత్కాలిక క్యాంపస్‌లో వివిధ కోర్సులను వచ్చే జనవరి నుంచి ప్రారంభించనున్నారు. ఆన్‌లైన్‌తో పాటు, తరగతి గదిలోనూ శిక్షణ అందిస్తారు. రెండు నుంచి మూడు నెలల వ్యవధి కలిగిన పది అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ కోర్సులను అందించనున్నారు. వీటిలో క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్, సైన్స్, ఇంజినీరింగ్‌లో ఏఐ వినియోగం, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఐఓటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వీటితో పాటు ప్రాచుర్యం పొందిన 'ఓ' లెవెల్ ప్రోగ్రామ్‌లను కూడా నిర్వహిస్తారు. అదనంగా 16 స్వల్పకాలిక కోర్సులను అందించనున్నారు. వీటిలో వీఎల్ఎస్ఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, బ్యాటరీ మేనేజ్‌మెంట్, బ్లాక్‌చైన్, సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్టింగ్, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలు ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో బోధించే అధ్యాపకులకు ఈ నైపుణ్యాలను అందించేందుకు పది విభాగాల్లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారు.

కూటమి ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలి

అమరావతి,స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం పోలీసులను, అధికారులను అడ్డం పెట్టుకుని సాగించిన అక్రమాలు, దౌర్జన్యాలపై శాసనమండలి వైయస్సార్సీపీ నేతలు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణతో పాటు ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, కల్పలత రెడ్డి, మొండితోక అరుణ్, రుహుల్లా, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, వెల్లంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్, మేరుగ నాగార్జున, వైయస్సార్సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గవర్నర్ ని కలిశారు. ఈ సందర్భంగా హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులను సైతం అమలు చేయకుండా, వైయస్సార్సీపీ అభ్యర్థులను కనీసం నామినేషన్ కూడా వేయనీయకుండా ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించిన కూటమి ప్రభుత్వానికి ఒక్క రోజు కూడా అధికారంలో కొనసాగే అర్హత లేదని వైయస్సార్సీపీ నేతలు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న ఈ ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలని రాష్ట్రపతికి, పార్లమెంట్‌కు సిఫారసు చేయాలని వారు గవర్నర్‌ను కోరారు.
గవర్నర్‌ను కలిసిన వారిలో అనంతరం లోక్‌భవన్ వద్ద బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు.

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ చూడని అరాచకాలు:

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ దఫా జరిగిన దారుణమైన ఘటనలు మునుపెన్నడూ జరగలేదని గవర్నర్ కి వివరించాము. ముఖ్యంగా హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా ప్రభుత్వ అధికారులు, పోలీసు యంత్రాంగం గౌరవించకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దౌర్జన్య కాండ, దుశ్శాసన పర్వం కొనసాగించారు
. ఎంతో శాంతియుతంగా ఉండే ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఇలాంటి అరాచకాలు సృష్టించడం రాష్ట్రానికి ఏమాత్రం మంచిది కాదు. కలకాలం వాళ్లే అధికారంలో ఉండిపోతామన్న ఆలోచనతో ఇంత దౌర్జన్యాలు చేస్తున్నారు. రాత్రి పోతే పగలు వస్తుంది, పగలు పోతే రాత్రి వస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

నారా దుశ్శాసనుడి చేతిలో ప్రజాస్వామ్యానికి వస్త్రాపహరణం

తాడేపల్లి, భీమోదయం: ఏపీలో జరుగుతున్న అరాచకాలపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. రిగ్గింగులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వైనంపై ట్వీట్ చేశారు. అరాచకాలకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలిచిన వీడియోలను పోస్టు చేశారు. మున్సిపల్ ఎన్నికలు రిగ్గింగ్,
జిల్లా పరిషత్ ఎన్నికలు రిగ్గింగ్, మండల పరిషత్ ఎన్నికలు రిగ్గింగ్, ఇప్పుడు పార్టీలకు అతీతంగా జరిగే పంచాయతీ ఎన్నికలు సైతం రిగ్గింగ్. ఎన్నిక ఏదైనా చివరకు టోటల్ ప్రజాస్వామ్యమే రిగ్గింగ్. గొర్రెతోలు కప్పుకున్న తోడేలు – నారా స్వామ్యం. నారా దుశ్శాసనుడి చేతిలో పట్టపగలే ప్రజాస్వామ్యానికి వస్త్రాపహరణం అని ధ్వజమెత్తారు.

రక్తపు మరకలు అంటించి..

ఏపీలో స్థానిక ఎన్నికల తీరు చూస్తే పాడె కట్టిన ప్రజాస్వామ్యం లా ఉందని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్లు వేయనివ్వకుండా, వేసినవాటిని అధికారులే చించేసిన ప్రజాస్వామ్యం, పోలింగ్ బూత్‌లను ఆక్రమించి, ప్రజల ఓట్లను అపహరించిన ప్రజాస్వామ్యం, గెలిచినవారిని ఓడినట్టుగా ప్రకటించిన ప్రజాస్వామ్యం, ఆర్వోలు, పోలీసులు, అధికార పార్టీ నేతలు కుమ్మక్కై ఫలితాలను శాసించే ప్రజాస్వామ్యం, నడిబజార్లో ప్రజాస్వామ్యానికి వెలకట్టి, పోలీసులు, అధికారులు, అధికార పార్టీ నేతలు వాటాలు పంచుకునే ప్రజాస్వామ్యం అడ్డుకోవాల్సిన ఎస్ఈసీ కూడా పచ్చముఠాలో చేరిన ప్రజాస్వామ్యం, ఐదేళ్ల మా పాలనలో సుస్థిరంగా, శాంతియుతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు రక్తపు మరకలు అంటించి, వ్యవస్థలను భ్రష్టుపట్టించిన ప్రజాస్వామ్యం అని చెప్పారు.

ఎన్నికల్లో అద్భుతమైన తీర్పు ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు

ఎన్నికల ఫలితాలపై అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానిక
ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారనే విషయాన్ని ఈ తీర్పు మరోసారి రుజువు చేసిందని స్పష్టం చేశారు. ఎన్నికలు జరగకుండా ఆపేందుకు కోర్టుల్లో 63 పిటిషన్లు వేసి, బీసీ రిజర్వేషన్లు, డీలిమిటేషన్ పేరిట అడ్డంకులు సృష్టించారని, హింసకు పాల్పడుతూ ఎదురు ఫిర్యాదులు చేసిన వైసీపీ డ్రామాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని సీఎం మండిపడ్డారు.

కూటమికి తిరుగులేని ప్రజాదరణ:

ఈవీఎం అయినా, బ్యాలెట్ పేపర్ అయినా, పోస్టల్ బ్యాలెట్ అయినా ప్రజల తీర్పు కూటమికే అనుకూలంగా ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక పోరులో కూటమి అపూర్వ విజయం సాధించిందని గణాంకాలతో వివరించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో 96.42 శాతం స్ట్రయిక్ రేట్, మండల పరిషత్‌లలో 93.15 శాతం, మున్సిపల్ ఎన్నికల్లో 94 శాతం స్ట్రయిక్ రేట్‌ను కూటమి దక్కించుకుందని వెల్లడించారు.
2024 సార్వత్రిక ఎన్నికల్లో 39.81 శాతంగా ఉన్న వైసీపీ ఓటు బ్యాంకు, ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో 33.56 శాతానికి పడిపోయిందని, ఏకంగా 6.25 శాతం ఓట్లు ఆ పార్టీకి తగ్గాయని తెలిపారు. కూటమికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదరణ మరింత పెరిగిందని, ఈ ఘన విజయంతో రాష్ట్రంలో 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్' ఏర్పాటైందని సీఎం పేర్కొన్నారు.

సామాన్య కార్యకర్తలు, విద్యావంతులకే జెడ్పీ పీఠాలు:

రాజకీయాల్లో కుటుంబ పాలన, ధన ప్రభావానికి తావులేకుండా పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడిన సామాన్య కార్యకర్తలను, విద్యావంతులను ఉన్నత పదవుల్లో కూర్చోబెట్టామని సీఎం వివరించారు. జనాభా దామాషా పద్ధతిన అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో సమన్యాయం కల్పించామన్నారు.కర్నూలు జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్‌గా 25 ఏళ్లకే ఎంబీబీఎస్ పూర్తి చేసిన షేక్ షాదికను, గంపలగూడెం జెడ్పీటీసీగా ఎంటెక్ చదివిన ఎస్సీ యువతి కోట పుల్లమ్మను గెలిపించుకున్నామని చెప్పారు. మొత్తం 22 జెడ్పీ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 12 మహిళలకే ఇచ్చామని, వీరిలో 14 మంది ఉన్నత విద్యావంతులు ఉన్నారని తెలిపారు. అలాగే 20 జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 11 మహిళలకు కేటాయించగా అందులో 17 మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లేనని వివరించారు.

మత్స్యకారులకు భరోసా

అమరావతి, భీమోదయం: అలలతో పోరాటం.. ఆటుపోట్లతో సహవాసం.. ప్రాణాలను పణంగా పెట్టి సాగించే వేట.. రెక్కల కష్టాన్నే నమ్ముకుని జీవించే గంగపుత్రుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని మత్స్యకారులు, ఆక్వా రైతులు, మత్స్యరంగంపై ఆధారపడిన కుటుంబాలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రానికి ఉన్న 1,053 కిలోమీటర్ల సముద్ర తీరం అపారమైన మత్స్య సంపదకు నిలయమని, లక్షలాది కుటుంబాలకు జీవనాధారమని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మత్స్యకారుల సంక్షేమం, ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

వేట నిషేధ సమయంలో రూ.268.60 కోట్ల ఆర్థిక భరోసా:

వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకారులకు గతంలో రూ.10 వేలుగా ఉన్న సహాయాన్ని రూ.20 వేలకు పెంచామని మంత్రి తెలిపారు. 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా 2026-27లో తొలి విడతగా 1,28,388 కుటుంబాలకు రూ.256.776 కోట్లు విడుదల చేయగా, రెండో విడతలో మరో 5,910 కుటుంబాలకు రూ.11.82 కోట్లు మంజూరు చేశామన్నారు. మొత్తంగా 1,34,298 కుటుంబాలకు రూ.268.60 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టామని వివరించారు. సంప్రదాయ మత్స్యకారుల హక్కులను దెబ్బతీసిన జీవో 217ను రద్దు చేసి సహకార సంఘాల ప్రయోజనాలను పరిరక్షించామని చెప్పారు. మత్స్యకారుల జీవనోపాధికి భంగం కలిగించే నిర్ణయాలను సహించబోమని స్పష్టం చేశారు.ం

మహిళల భద్రతకు రూ.30 లక్షల విరాళం అందించిన శ్రీ కార్తికేయ ఫార్మా

హైదరాబాద్, నవంబర్ 21:(ప్రజా యుద్ధ నౌక):మహిళల భద్రతను మరింత బలోపేతం చేయడంలో భాగంగా శ్రీ కార్తికేయ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎన్‌సీ)కు రూ.30 లక్షల విరాళాన్ని అందించింది. ఈ మొత్తాన్ని కౌన్సిల్‌కు చెందిన మహిళా ఫోరమ్ కార్యకలాపాల కోసం అందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ మహేష్ మురళీధర్ భగవత్, ఐపీఎస్ నాయకత్వంలో హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రజా–ప్రైవేటు భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తూ నగరంలో భద్రతను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోంది. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పోలీసింగ్ కార్యక్రమాలు, సమాజ భద్రతకు సంబంధించిన కార్యక్రమాలకు ప్రైవేటు సంస్థల సహకారాన్ని సమీకరిస్తోంది.

ఈ నేపథ్యంలో శ్రీ కార్తికేయ ఫార్మా సంస్థ అందించిన రూ.30 లక్షల విరాళం మహిళల భద్రతకు సంబంధించిన కార్యక్రమాలకు తోడ్పడనుంది. మహిళల రక్షణ, భద్రతపై అవగాహన పెంపొందించడం, సమాజంలో భద్రతా చర్యలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలకు ఇటువంటి భాగస్వామ్యాలు దోహదపడనున్నాయి.

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

హైదరాబాద్, నవంబర్ 21(ప్రజా యుద్ధ నౌక):తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి, వెబ్‌సైట్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నిర్ణయించింది. శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లోని మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో కమిటీ సమావేశం నిర్వహించారు.కమిటీ చైర్మన్ కే. కేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి, శ్యాం మోహన్ పాల్గొన్నారు.తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం ఇప్పటికే వివిధ యూనివర్సిటీల ఉద్యమకారులు, కళాకారులు, సబ్బండ వర్గాలతో జరిపిన సంప్రదింపులు, ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, వాటి పురోగతిని కమిటీ సమీక్షించింది. గుర్తింపు ప్రక్రియను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన తదుపరి చర్యలపై సభ్యులు చర్చించారు.ఉద్యమకారుల వివరాల నమోదు, గుర్తింపు ప్రక్రియ కోసం ఏర్పాటు చేయనున్న ప్రత్యేక వెబ్‌సైట్ ప్రస్తుత స్థితిగతులు, ప్రారంభ గడువు, వెబ్‌సైట్ ఏర్పాటును వేగవంతంగా పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో కీలకంగా చర్చించారు. వెబ్‌సైట్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిటీ అభిప్రాయపడింది.

కాంగ్రెస్‌కు రాజీనామా..

హైదరాబాద్, నవంబర్ 21

ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలోకి చేరికల సందడి నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఖైరతాబాద్ నాయకుడు ప్రవీణ్, సోమాజిగూడకు చెందిన శ్రీనాథ్ తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు భారీ ర్యాలీలుగా బయలుదేరారు. ఈ ర్యాలీలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌తో కలిసి ప్రారంభించారు.ఖైరతాబాద్‌లోని బడా గణేష్ సెంటర్ వద్ద ప్రవీణ్ నాయకత్వంలోని ర్యాలీని, సోమాజిగూడలోని మలబార్ గోల్డ్ షోరూమ్ వద్ద శ్రీనాథ్ నాయకత్వంలోని ర్యాలీని తలసాని శ్రీనివాస్ యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఇరు ప్రాంతాల నుంచి బయలుదేరిన ర్యాలీలు భారీ సంఖ్యలో కార్యకర్తలు, అనుచరులతో తెలంగాణ భవన్‌కు చేరుకున్నాయి.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జయసింహ, రాంరెడ్డి, గజ్జెల నగేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పులి కదలికలపై నిరంతర నిఘా

అమరావతి, ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు పరిసరాల్లోని అటవీ ప్రాంతాల్లో తిరుగుతూ, ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్న పులిని సురక్షితంగా పట్టుకునేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పులి కదలికలపై నిరంతరం నిఘా పెడుతూ, ప్రజల భద్రత భరోసా ఇవ్వాలని పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి పులిని సురక్షితంగా పట్టుకునేందుకు అధునాతన సాంకేతికతతోపాటు ఇతర రాష్ట్రాల నిపుణుల సహకారం తీసుకోవాలని అటవీశాఖ ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ స్వీయ పర్యవేక్షణలో ఆపరేషన్ నిర్వహించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీ శాఖ ఉన్నతాధికారులతో ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించారు. పులి కదలికలు, దాని సంచార ప్రాంతాలు, ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.
పులి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, పులి సంచార మార్గాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ సమాచారాన్ని పరిసర గ్రామాల ప్రజలకు చేరవేయాలి. స్థానిక అటవీ శాఖ బృందాలతో సమన్వయం చేసుకుంటూ హనుమాన్ బృందాలతో విస్తృతంగా గస్తీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పులి కదలికలను మరింత సమర్థవంతంగా గుర్తించేందుకు థర్మల్ డ్రోన్లు,

ఏఐ ఆధారిత కెమెరా ట్రాప్‌లు, ఇతర ఆధునిక సాంకేతిక పరికరాలను విస్తృతంగా వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌ను పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్, ఇతర అటవీ శాఖ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో చేపట్టే చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పులి సంచరిస్తున్న ప్రాంతానికి సమీపంలోని గ్రామాల్లో ప్రజల భద్రతకు తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులు, పశువుల కాపరులు, స్థానిక ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకుండా అవసరమైన సూచనలు చేయాలన్నారు. వన్యప్రాణి సంరక్షణ నిబంధనలు, నిర్దేశిత ప్రోటోకాల్స్‌ను పాటిస్తూ, అనుభవజ్ఞులైన వన్యప్రాణి నిపుణుల సహకారంతో పులిని సురక్షితంగా పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో ప్రజలకుగానీ, పులికిగానీ ఎలాంటి హాని కలగకూడదని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజల ప్రాణరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే, పులి సంరక్షణను కూడా బాధ్యతగా తీసుకుని జాగ్రత్తగా, సమన్వయంతో చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ, చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు కలగకుండా అన్ని చర్యలను, అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

వేములదీవి ఈస్ట్ గ్రామపంచాయతీ ఏకగ్రీవం వెనుక కీలక పాత్ర రాజేష్ మైలాబత్తుల

నర్సాపురం సెప్టెంబర్ 21 సత్య దీపిక ఉదయం విలేకరి.
సర్పంచ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేష్ మైలాబత్తుల ఘన సన్మానం
వేములదీవి ఈస్ట్: వేములదీవి ఈస్ట్ గ్రామపంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, జి జి ఎం ట్రస్ట్ -- కృష్ణ మైలాబత్తుల ఫౌండేషన్ చైర్మన్ రాజేష్ మైలాబత్తుల కీలక పాత్ర పోషించారు. వ్యక్తిగత రాజకీయ ఆశయాల కంటే గ్రామ ఐక్యతకు ప్రాధాన్యతనిస్తూ ఆయన తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశంగా నిలిచింది.
గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య పదవుల విషయంలో విభేదాలు, అసంతృప్తులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కొందరు పార్టీ కార్యకర్తలు, నాయకులు రాజేష్ మైలాబత్తుల ని సర్పంచ్‌గా పోటీ చేయాలని కోరారు. ఆయనకు మద్దతు కూడా ప్రకటించారు.
అయితే కూటమి ఐక్యతను కాపాడాలనే ఉద్దేశంతో మొదట పోటీకి వెనుకంజ వేసిన రాజేష్ మైలాబత్తుల , చివరి దశలో కొందరు పార్టీ కార్యకర్తలు, నాయకుల విజ్ఞప్తితో నామినేషన్‌కు సిద్ధమయ్యారు. అనంతరం సుమారు మూడు గంటల పాటు జరిగిన చర్చల్లో గ్రామ అభివృద్ధి, పంచాయతీ వ్యవహారాల్లో తగిన గౌరవం, ప్రాధాన్యత, భాగస్వామ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలను రాతపూర్వకంగా పొందిన అనంతరం కూటమి ఐక్యత కోసం ఆయన పోటీ నుంచి తప్పుకోవడానికి



అంగీకరించారు. ఈ నేపథ్యంలో వేములదీవి ఈస్ట్ గ్రామపంచాయతీ ఎన్నిక ఏకగ్రీవంగా జరగడానికి మార్గం సుగమమైంది. ఈరోజు ఘనంగా సర్పంచ్ ప్రమాణ స్వీకారం ఉదయం 10 గంటలకు వేములదీవి ఈస్ట్ గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన శ్రీమతి హేమ దావీదు రాజు కి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమానికి రాజేష్ మైలాబత్తుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు నూతన సర్పంచ్ హేమ దావీదు రాజు సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి అడిదెల కళ్యాణ్ బందెల వేణు తదితరులు పాల్గొన్నారు. గ్రామపంచాయతీ ఎన్నిక ఏకగ్రీవం కావడానికి సహకరించి, పార్టీ కార్యకర్తలు ఘనంగా శాలువాతో సత్కరించి అభినందించారు. గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, రాజకీయ విభేదాలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

పదవి కంటే గ్రామ ఐక్యత ముఖ్యం...

వ్యక్తిగత రాజకీయాల కంటే ప్రజల గౌరవం ముఖ్యం...

రాజేష్ మైలాబత్తులతెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులుచైర్మన్ జిజిఎం ట్రస్ట్, కృష్ణ మైలాబత్తుల ఫౌండేషన్ తెలియజేశారు.

29వ డివిజన్ కూటమి అభ్యర్థిని పినిశెట్టి పల్లవి సురేష్‌ను గెలిపించండి: ఎమ్మెల్యే వనమాడి



కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు స్థానిక 29వ డివిజన్‌లో కూటమి అభ్యర్థిని పినిశెట్టి పల్లవి సురేష్‌కు మద్దతుగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ మేయర్ అభ్యర్థి ఆకుల భవాని, కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందాలన్నా, కాకినాడ నగరంలో అభివృద్ధి పనులు వేగవంతం కావాలన్నా స్థానిక సంస్థల్లో కూడా కూటమి అభ్యర్థుల విజయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. 29వ డివిజన్‌లో ప్రజల సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల కల్పనకు, డివిజన్ సమగ్ర అభివృద్ధికి కూటమి అభ్యర్థిని పినిశెట్టి పల్లవి సురేష్ నిరంతరం కృషి చేస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కావున 29వ డివిజన్ ప్రజలందరూ కూటమి అభ్యర్థిని పినిశెట్టి పల్లవి సురేష్‌కు తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ జనసేన నాయకులు మల్లాడి రాజేంద్ర ప్రసాద్,
పినిశెట్టి సురేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఐడియల్ కళాశాలలో "నపా ముక్త భారత్ అభియాన్"



కాకినాడ సత్య దీపిక ఉదయం నవంబర్ 21:
కేంద్ర ప్రభుత్వ ఆదేశాలో మీరకు నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐడియల్ కాలేజ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్. ఎ గీతాంజలి దేవి, ఇన్ సచ్ ప్రిన్సిపల్ ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాశ్రీ జి .స్వామీజీ గారు ఆధ్వర్యంలో మై రా యువ భారత్ కాకినాడ ప్రతినిధి శ్రీ జి. సత్తిబాబు గారు యువతలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్. ఎ గీతాంజలి దేవి. ఇన్ సచ్ ప్రిన్సిపల్ ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాశ్రీ జి .స్వామీజీ గారు మాట్లాడుతూ, నసా ముక్తి యుని భారత్ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భారతదేశంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం పెరుగుతున్న తీరు, వాటి వల్ల కలిగే శారీరక, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. యువత మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.మేర యువ భారత్ ప్రతినిధి. సత్తిబాబు గారు మాట్లాడుతూ, నహ ముక్త భారత్ అభియాన్ యొక్క లక్ష్యాలు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండవలసిన ఆవశ్యకత, మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తిగల జీవితంతో పాటు కుటుంటం మరియు సమాజంపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు.అనంతరం విద్యార్థులు నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రాముఖ్యత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు మరియు యువత బాధ్యతలపై ప్రసంగించారు. మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కడూ కృషి చేయాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశాన్ని అందించాడు.ఈ కార్యక్రమంలో హెచ్ వై డి నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై ఆర్ ఎల్ చౌదరి, సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

ఎమ్మెల్యేనాయకర్ సమక్షంలో జనసేన పార్టీలోకి చేరిన అంజిబాబు



నర్సాపురం నవంబర్ 21 సత్య దీపిక ఉదయం విలేకరి.కె.పి. పాలెం నార్త్‌లో జనసేన పార్టీలోకి చేరిక శ్రీ అల్లం అంజిబాబు కి కండువా కప్పి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలకు మరియు నియో జకవర్గంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై మొగల్తూరు మండలం కె.పి. పాలెం నార్త్‌కు చెందిన అల్లం అంజిబాబు వైఎస్సార్సీపీని వీడి ఈరోజు జనసేన పార్టీలో చేరారు.
రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ వారికి జనసేన పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.
ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ చేరవేసేందుకు అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు

దుళ్ళ గ్రామంలో కూటమి అభ్యరి సూరపురెడ్డి శిరీష భరత్ విస్తృత ప్రచారం..

వాడవాడలా పర్యటిస్తూ ప్రజలతో మమేకం.. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వెల్లడి...

కడియం నవంబర్21(సత్య దీపిక ఉదయం స్టాఫ్ రిపోర్టర్):తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్ళ గ్రామంలో కూటమి సర్పంచ్ అభ్యర్థి సూరపురెడ్డి శిరీష భరత్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. గ్రామంలోని వాడవాడలా పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి సూరపురెడ్డి శిరీష భరత్ మాట్లాడుతూ.. రానున్న పంచాయతీ ఎన్నికల్లో తమను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే దుళ్ళ గ్రామ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. గ్రామానికి అవసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని అభివృద్ధి పథంలో దుళ్ళ గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున కూటమి బలపరిచిన అభ్యర్థికి అత్యధిక మెజార్టీతో విజయాన్ని అందించిన దుళ్ళ గ్రామ ఓటర్లకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమపై చూపించిన ఆదరాభిమానాలను ఎప్పటికీ మరువలేమని అన్నారు.అదే విధంగా రానున్న పంచాయతీ ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థితో పాటు వార్డు సభ్యుల అభ్యర్థులకు కూడా ప్రజలు తమ అమూల్యమైన ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూరపురెడ్డి శిరీష భరత్ గ్రామ ప్రజలను కోరారు.ప్రజల ఆశీస్సులు, సహకారంతో దుళ్ళ గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.



ప్రపంచ మత్స్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ.

ఉభయగోదావరి జిల్లాల సహాయ సహకార సంఘాల అధ్యక్షుడు మైల వసంతరావు

నర్సాపురం నవంబర్ 21 సత్య దీపిక ఉదయం విలేకరి. నవంబర్ 21: ఏలూరులోని జిల్లా మత్స్య శాఖ అధికారి కార్యాలయంలో 'ప్రపంచ మత్స్య దినోత్సవం' వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఉభయ గోదావరి జిల్లాల మత్స్యకార సహాయ సహకార సంఘాల అధ్యక్షుడు మైల వసంత రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ: మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతికి, సంక్షేమానికి సహకార సంఘాలు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.మత్స్య సంపదను పెంపొందించడంతో పాటు ఆధునిక పద్ధతులను అవలంబించడం ద్వారా మత్స్యకారులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి మత్స్యకార కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మత్స్యకారుల హక్కుల సాధనకు, వారి సమస్యల పరిష్కారానికి ఉభయగోదావరి జిల్లాల మత్స్యకార సహాయ సహకార సంఘాల తరఫున నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజీ బాలాజీ. ఎక్స్ డైరెక్టర్ కొల్లాటి ఆదినారాయణ. డిఎఫ్ఓ ప్రసాద్. ఏ డి తిరపతయ్య. ఏ డి రాజ్ కుమార్. జిల్లా సంఘ ఎండి జోత్స్న. జిల్లా మత్స్య శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన మత్స్యకార సంఘాల నాయకులు, మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



మల్లవరంలో భారీగా టిడిపిలో చేరికలు. ఇంచార్జ్ పోత్తూరి రామరాజు



నర్సాపురం నవంబర్ 21 సత్య దీపిక ఉదయం విలేఖరి.
మల్లవరం లంకలో తెలుగుదేశం పార్టీలో చేరికలు
పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన పలువురు
నరసాపురం మండలం మల్లవరం లంక గ్రామానికి చెందిన గొట్టుముక్కల నీలవర్ధనం, గొట్టుముక్కల రామకృష్ణ, దిపాటి శ్రీను, దిడ్ల చల్లారావు, దిడ్ల పండు రాజు, తణుకుల శ్రీను తదితరులు నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.సందర్భంగా పొత్తూరి రామరాజు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరడం సంతోషకరమని రామరాజు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేస్తూ, గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నరసాపురం మండలం ఎంపీపీ వాతాడి ఉమామహేశ్వరరావు, మల్లవరం లంక గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నేతల ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలు

-- నామినేషన్ కేంద్రాల వద్ద పోలీస్ శాఖ సూచనలుసీఐ రామకృష్ణ



అనకాపల్లి నవంబర్ :21(సత్య దీపిక ఉదయం బ్యూరో)రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రశాం తంగా, పారద ర్శకంగా నిర్వహిం చేందుకు పోలీస్ శాఖ తరఫున కే కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ, వి మాడుగుల మండలలో అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని సీఐ రామకృష్ణ తెలిపారు
ఈ సందర్భంగా అభ్యర్థులు, వారి మద్దతుదారులు మరియు ప్రజలు క్రింది పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించవలసిందిగా తెలియజేయడమైనది.నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 ప్రకారం జారీ చేసిన నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయి. సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొన్న ఆంక్షలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి.నిషేధాజ్ఞల ప్రకారం అనుమతించిన పరిమితికి మించి ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడి ఉండరాదు నామినేషన్ కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించరాదు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి గుంపులు, ప్రదర్శనలు నిర్వహించరాదు.

ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను మళ్లీమళ్లీ వాడుతున్నారా..

వాటిపై టాయిలెట్ కుండీల కంటే ఎక్కువ బ్యాక్టీరియా ఉంటుందట..!



డ్యూటీలకు వెళ్లే ఉద్యోగులు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఇతర పనులకు వెళ్లేవాళ్లు తమ వెంట వాటర్ బాటిల్స్‌లో నీళ్లు తీసుకెళ్తుంటారు. ఈ రోజు తీసుకెళ్లిన బాటిల్‌నే మరుసటి రోజు శుభ్రం చేసుకుని వాడుతుంటారు. అయితే ఇలా పునర్వినియోగించే మంచినీళ్ల బాటిళ్లపై మిలియన్ల కొద్ది బ్యాక్టీరియా ఉంటుందట. అది టాయిలెట్ కుండీలపై ఉండే బ్యాక్టీరియా కంటే 40 వేల రెట్లు అదనమట.

అమెరికాకు చెందిన 'వాటర్ ఫిల్టర్ గురు.కామ్' వివిధ రకాల బాటిల్ మూతల నుంచి నమూనాలను సేకరించి, పరిశోధించింది. ఈ పరిశోధనల్లో మంచి నీళ్ల బాటిళ్లపై గ్రామ్-నెగెటివ్ రాడ్స్ బాసిల్లస్ వంటి రెండు రకాల బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు. గ్రామ్ నెగెటివ్ బ్యాక్టీరియావల్ల కలిగే ఇన్ఫెక్షన్‌తో యాంటీ బయోటిక్స్ పనిచేయకుండా పోతాయని, బాసిల్లస్ రకానికి చెందిన బ్యాక్టీరియా జీర్ణాశయ సంబంధిత సమస్యలకు కారణమవుతుందని పరిశోధకులు తెలిపారు.

ఇక పునర్వినియోగ మంచినీళ్ల బాటిళ్ల శుభ్రతను పరిశోధకులు ఇతర వస్తువులు, పాత్రలతో పోల్చారు. కిచెన్ సింక్‌తో పోలిస్తే మంచినీళ్ల బాటిల్‌పై రెండు రెట్లు అదనంగా బ్యాక్టీరియా ఉందట. ఇక కంప్యూటర్ మౌస్‌తో పోలిస్తే నాలుగు రెట్లు అదనంగా బ్యాక్టీరియా కనిపించిందట. అయితే బాటిళ్లపై అధిక సంఖ్యలో బ్యాక్టీరియా వృద్ధి చెందినప్పటికీ వాటిలో అన్నీ ప్రమాదకర ఇన్‌ఫెక్షన్ కారకాలు కావని యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్ వైద్య నిపుణులు వెల్లడించారు.

'వాటర్ బాటిళ్ల కారణంగా అనారోగ్యానికి గురైన కేసుల గురించి నేను ఎప్పుడూ వినలేదు. అలాగే ట్యాప్ వాటర్‌లో కూడా బ్యాక్టీరియా ఉత్పత్తి కాదు. కానీ మనిషి నోటిలో ఉండే బ్యాక్టీరియాతోనే వాటర్ బాటిళ్లు కలుషితమయ్యే అవకాశం ఉంది' అని వారు తెలిపారు. అయితే మంచి నీళ్ల కోసం పునర్వినియోగించే బాటిళ్లను రోజుకు ఒకసారి సబ్బు కలిపిన వేడి నీటితో శుభ్రం చేస్తే అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు తగ్గుతాయని పరిశోధకులు చెబుతున్నారు.

రేవంత్ కూతురు కార్పొరేట్ స్కూల్స్..

పొంగులేటి కూతురేమో ఇంటర్నేషనల్ స్కూల్స్ : మన్నె క్రిశాంక్

సీఎం రేవంత్ రెడ్డి కూతురు నైమిష రెడ్డి కార్పొరేట్ స్కూల్స్‌ను చూసి మంత్రి పొంగులేటి కూతురు స్వప్ని రెడ్డి కూడా ఇంటర్నేషనల్ స్కూల్స్ కంపెనీ మొదలుపెట్టిందని బీఆర్ ఎస్ నేత మన్నె క్రిశాంక్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి కూతురు నైమిష రెడ్డి కార్పొరేట్ స్కూల్ గురించి అందరికి తెలిసిందే. రూ.2.50 లక్షలు ప్రతీ సంవత్సరం ఒక్క విద్యార్థి ఫీజు.. కొంపల్లిలో, కొల్లూరు, కోకాపేటలో రకరకాల నెట్ వర్క్ కార్పొరేట్ స్కూల్స్ నిర్మాణంలో జెట్ స్పీడులో ఉన్నాయి.. ఒక్కటంటే ఒక్క గురుకుల పాఠశాలవైపు రేవంత్ రెడ్డి పోరు.. అక్కడ ఫుడ్ పాయిజనింగ్ అయితుంటే.. విద్యార్థుల పురుగుల బువ్వ తింటుంటే, విద్యార్థులు, విద్యార్థినీలు ఆస్పత్రుల పాలవు తుంటే.. రేవంత్ రెడ్డికి పట్టింపు లేదన్నారు.మీరే నిర్మాణం చేయాల్నా.. మరి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఏం చేయాలే.. డిఫెన్స్ చేసుకున్నవ్ నువ్విక్కడ.. మళ్లీ నీకొక్క స్కూల్ పెరుగుతుందని పొంగులేటి కూతురు కూడా స్కూల్ కంపెనీ మొదలుపెట్టింది.. జులై 2026 ఈ కంపెనీ మొదలైంది.. పొంగులేటి కూతురు స్వప్ని రెడ్డి పొంగులేటి హీూఎ జుణఖ పేరు మీద ఇంటర్నేషనల్ స్కూల్స్ కంపెనీ పెట్టారు.. 2027 సెప్టెంబర్ నుంచి కొత్త స్కూల్ లాంచ్ అవుతుందట. ఇప్పటికే ప్రకటించేసిర్రు. సీఎం రేవంత్ రెడ్డి కూతురు నైమిష రెడ్డి కార్పొరేట్ స్కూల్స్‌ను చూసి మంత్రి పొంగులేటి కూతురు స్వప్ని రెడ్డి కూడా ఇంటర్నేషనల్ స్కూల్స్ కంపెనీ మొదలుపెట్టింది. తెలంగాణ విద్యాశాఖ మంత్రి కూతురు కార్పొరేట్ స్కూల్స్ పెడితే, రెవెన్యూ, సమాచారం శాఖ మంత్రి కూతురు ఇంటర్నేషనల్ స్కూల్స్ పెట్టింది. ఇక ప్రభుత్వంలో ఉన్న మంత్రులు ప్రభుత్వ సంస్థలను పక్కన పెట్టేసి వాళ్ల వాళ్ల కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మాణంలో పడ్డారన్నారు.2014 కంటే ముందు సర్కార్ దవాఖానాల్లో ఐసీయూలు పని చేస్తలేవని, బెడ్లు లేవనే పరిస్థితులుండేవి. మూడు సంవత్సరాలు గడుస్తున్నా వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఓపెన్ చేయలేదు, టిమ్స్ అల్వాల్, టిమ్స్ సనత్ నగర్, టిమ్స్ ఎల్బీ నగర్ ఇవన్నీ కూడా ఓపెన్ చేయకుండా అలానే ఉంచారన్నారు. మెడికవర్ ఆస్పత్రులు మాత్రం బ్రహ్మాండంగా ఓపెన్ అయినయి. సర్కార్ దవాఖానా, సర్కార్ బడులు మాత్రం ఓపెన్ చేయరని మన్నె క్రిశాంక్ ఫైర్ అయ్యారు.కేసీఆర్‌కు పొలం ఉంటే పెద్ద నేరం లాగా చేస్తున్నారు కదా.. మరి మీ స్కూల్స్ సంగతి ఏంటి..? మీ హ్యుందాయ్ షో రూమ్స్ సంగతి ఏంటి..? మీ మెడికవర్ హాస్పిటల్ సంగతి ఏంటి..? మీ డిఫెన్స్ కంపెనీల సంగతి ఏంటి..? మీ =9 కన్‌స్ట్రక్షన్స్, మాల్స్ సంగతి ఏంటి..? వీళ్ళ వ్యాపారాలు రూ. లక్ష కోట్లు దాటిపోయాయి. తెలంగాణలో గురుకుల పాఠశాలల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు



కెనడాలో కాల్పుల కలకలం..

ఇద్దరు భారత సంతతి వ్యక్తులు దుర్మరణం!

● పక్కా ప్రణాళికతో టార్గెటెడ్ షూటింగ్.. ఘటనా స్థలంలోనే ఇద్దరూ మృతి

● నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాల గాలింపు

కెనడా, నవంబర్ 21

కెనడాలో మరోసారి తుపాకీ కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు భారత సంతతికి చెందిన వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రతపై మరోసారి చర్చకు తెరలేపింది.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ కాల్పుల ఘటన సాధారణ నేరంగా కాకుండా ముందస్తు ప్రణాళికతో నిర్వహించిన లక్ష్మిత దాడి (టార్గెటెడ్ షూటింగ్)గా భావిస్తున్నారు. బాధితులను లక్ష్యంగా చేసుకునే దుండగులు ఈ దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాల్పులు జరిగిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే తీవ్ర గాయాలపాలైన ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్లు నిర్ధారించారు.

ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తులు ఎవరు? బాధితులకు నిందితులతో గతంలో ఏమైనా వివాదాలు ఉన్నాయా? వ్యక్తిగత కక్షలతో ఈ దాడి జరిగిందా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించారు.ఘటనా స్థలంలోని ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ కాల్పుల వెనుక ఉన్న అసలు కారణాలు, నిందితుల వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

భారతీయుల్లో ఆందోళన

ఉపాధి, విద్య, వ్యాపారాల నిమిత్తం కెనడాలో నివసిస్తున్న భారతీయుల సంఖ్య గణనీయంగా ఉంది. ఈ నేపథ్యంలో ఇద్దరు భారత సంతతి వ్యక్తులు కాల్పుల్లో మరణించడం ప్రవాస భారతీయుల్లో ఆందోళన కలిగిస్తోంది. బాధిత కుటుంబాల్లో విషాదం నెలకొంది.

అయితే మృతుల పేర్లు, స్వస్థలాలు, కాల్పులు జరిగిన ప్రాంతం, ఘటనకు సంబంధించిన ఇతర వివరాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు పూర్తయిన తర్వాతే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



బిల్లకుర్రు సర్పంచ్ అభ్యర్థికి మద్దతుగా జడ్పీ వైస్ చైర్మన్ రామకృష్ణ ప్రచారం



కొత్తపేట, నవంబర్ 21.
(సత్య దీ పీక ఉదయం ప్రతినిధి)
బిల్లకుర్రు గ్రామ పంచాయతీలో కూటమి సర్పంచ్ అభ్యర్థి ఈతకోట రమ్య రేవతి ఆనంద్ కు మద్దతుగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ యెలిశెట్టి రామకృష్ణ (చిన్న) శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులను గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు.గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా కూటమి అభ్యర్థులకు ప్రజలు తమ మద్దతు అందించాలని ఈ సందర్భంగా రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

వైభవంగా శ్రీలక్ష్మీనారాయణ స్వామి కళ్యాణం!



కాట్రేనికోన, నవంబర్ 21 (సత్య దీపిక ఉదయం విలేకరి): కాట్రేని కోన పంచాయతీ గచ్చకాయల పోర ఎంజీఆర్ కాలనీలోని శ్రీలక్ష్మీనా రాయణ స్వామి ఆలయ 5వ వార్షికో త్సవం మరియు క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన్ని పురస్కరిం చుకుని శనివారం కార్తీక దామోదరుడు శ్రీలక్ష్మీనారా యణ స్వామివారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభ వంగా జరిగింది. ఆలయ అర్చకులు ఫణి ఆచార్యులు వేదమంత్రోచ్ఛారణల నడుమ ఆలయ ధర్మకర్త మల్లాడి మహావిష్ణుభైరవ (విష్ణు), మీరారాణి దంపతులు ఈ కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉదయం పుణ్యాహవా చనం, గణపతి పూజ, అష్టదిక్పాలక, నవగ్రహ మండపారాధన, కలశ పూజ, కుంకుమార్చన, తులసి బిల్వార్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం శ్రీలక్ష్మీ సమేత కార్తీక దామోదరునికి పంచామృతాలు, పంచఫల రసాలతో మహాభిషేకం నిర్వహించి, పసుపు, కుంకుమ, గంధం, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. లోక కళ్యాణార్థం నిర్వహించిన ఈ దివ్య కళ్యాణ వేడుకను తిలకించేందుకు కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మేకలకు మేత కోసం వెళ్లి తిరిగి రాని భీమారావు

మొగిలిపాడులో వ్యక్తి అదృశ్యం.. ఆచూకీ కోసం గాలిస్తున్న కాశీబుగ్గ పోలీసులు



పలాస నవంబర్ 21(సత్యదీపిక ఉదయం బ్యూరో శంకర్):
శ్రీకాకుళం జిల్లా పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మొగిలిపాడు గ్రామంలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. గ్రామంలోని హరిజనవీధికి చెందిన టొక్క భీమారావు (51) ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో మేకలకు మేత తీసుకువస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. అయితే ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.భీమారావు భార్య మహాలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇళ్లతో పాటు వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో ఈ నెల 21వ తేదీ తెల్లవారుజామున కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి అదృశ్యమైన భీమారావు ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.

ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించండి

అదృశ్యమైన వ్యక్తి టొక్క భీమారావు, తండ్రి జంగమయ్య, వయస్సు 51 సంవత్సరాలు. హరిజనవీధి, మొగిలిపాడు గ్రామం, పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ నివాసి. ఆయన ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

సంప్రదించాల్సిన నంబర్లు:
6309990825
6309990857

PRINTED , PUBLISHED & " and OWNER By, "S.S.RAO," And PRINTED at JS PRINTRS D.NO.2/720-7/1, -URBAN COLONY,TOWN &MANDAL ATMAKUR,NANDYAL
Andhra Pradesh, pin: 518422, And Published At DOOR NO: 5-642,ABBIREDDY COLONY, KAMANAGURUVU VILLAGE,AMALAPURAM MANDAL, DR.B.R.AMBEDKAR KONASEEMA DISTRICT, ANDHRA PRADESH - 533201.,"Email ID," sdudayam@gmail.com" Editor & Pro S.S.RAOR.N.I. NO : APTEL/26/A4267 MOBILE NUMBER: 9440869757, 9160541579

రెండు పంచాయతీల్లో ఏకగ్రీవాల జోరు!





కాట్రేనికోన, నవంబర్ 21 (సత్య దీపిక ఉదయం విలేకరి) : కాట్రేనికోన మండలంలోని కాట్రేనికోన, పల్లం గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలాంటి పోటీ లేకుండా ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవమయ్యాయి. కాట్రేనికోన సర్పంచ్‌గా కూటమి బలపరిచిన అభ్యర్థి నాగిడి ధనలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికై ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకోగా, ఇక్కడి 16 వార్డుల్లో కూటమి మద్దతుదారులు 9, వైసీపీ మద్దతుదారులు 7 స్థానాల్లో ఏకగ్రీవంగా గెలుపొందడంతో ఇరువర్గాల అవగాహన మేరకు ఉపసర్పంచ్ పదవిని వైసీపీకి కేటాయించేలా ఒప్పందం కుదిరినట్లు సమాచారం. మరోవైపు పల్లం గ్రామ సర్పంచ్‌గా దండుప్రోలు సత్యవేణి, ఉపసర్పంచ్‌గా దండుప్రోలు సత్యం కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల ఖర్చులు, వర్గ విభేదాలకు తావులేకుండా గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పెద్దలు, గ్రామస్థులు తీసుకున్న ఈ ఏకగ్రీవ నిర్ణయంపై స్థానిక నేతలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కో-ఆప్షన్ సభ్యుడిగా కదంబాల వెంకటరమణ పేరు ప్రతిపాదన



వజ్రపుకొత్తూరు నవంబర్21 (సత్యదీపిక ఉదయం బ్యూరో): శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడిగా సీనియర్ నాయకుడు కదంబాల వెంకటరమణ పేరును ప్రతిపాదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి (వీసీ) ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. మండల పరిషత్‌లో కో-ఆప్షన్ సభ్యుడిగా కదంబాల వెంకట రమణ పేరు ప్రతిపాదన నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. సీనియర్ నాయకుడికి ఈ అవకాశం కల్పించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



పలాస నవంబర్ 21(సత్యదీపిక ఉదయం బ్యూరో) : శ్రీకాకుళం జిల్లా పూండి-నౌపడ రైల్వే స్టేషన్ల మధ్య జరిగిన రైలు ప్రమాదంలో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలి యని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు నలుపు రంగు ప్యాంటు, సిమెంట్ రంగు షర్టు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఎడమ ఛాతీపై నెమలి బొమ్మతో కూడిన పచ్చబొట్టు ఉన్నట్లు గుర్తించారు. మృతుడిని గుర్తించిన వారు లేదా అతని కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు పలాస జీఆర్పీ ఎస్ఐను సంప్రదించాలని కోరారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఫొటోను కూడా విడుదల చేశారు.
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 92475 85743

బండారు కృషితో సరిపల్లి సర్పంచ్, ఆరుగురు సభ్యులు ఏకగ్రీవం



నర్సాపురం, నవంబర్ 21 సత్యదీపిక ఉదయం విలేకరి – నరసా పురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు గ్రామ అభివృద్ధికి కృషి చెయ్యాలనే ఉద్దేశ్యంతో కూటమి నాయకులను, గ్రామ పెద్దలను, వైసిపి నాయకులను కలుపుకుని గ్రామస్తులను ఏకం చేసి నరసా పురం మండలం సరిపల్లి గ్రామ సర్పంచ్ తో పాటు 6 గురు వార్డు సభ్యులు లను ఏకగ్రీవం చేశారు. ఈ సందర్భంగా సరిపల్లి గ్రామ సర్పంచ్ మంచిగంటి లక్ష్మి సూర్య గంగా భవానీ వార్డు సభ్యులు 4వ వార్డు వర్ధనపు ప్రమీల 5వ వార్డు పీతల లక్ష్మీ, 6వ వార్డు చెట్టుం సరోజినీ 7వ వార్డు మైలబత్తుల ప్రసాద్ 8వ వార్డు మంచిగంటి శివ శంకర్ ప్రసాద్ 9వ వార్డు సోమిశెట్టి దేవి ఏకగ్రీ వంగా ఎంపిక య్యారు. ఏకగ్రీవంగా ఎంపికైన వారిని నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు శుభాకాంక్షలు తెలిపి సరిపల్లి గ్రామం ఉత్తమ గ్రామంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్యే నాయకర్ సమక్షంలో జనసేన పార్టీలోకి చేరిన అంజిబాబు



నర్సాపురం నవంబర్ 21 సత్య దీపిక ఉదయం విలేకరి – కె.పి. పాలెం నార్త్‌లో జనసేన పార్టీలోకి చేరిక అల్లం అంజిబాబు కి కండువా కప్పి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశ యాలకు మరియు నియోజక వర్గంలో కూటమి ప్రభుత్వం చేపడు తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై మొగల్తూరు మండలం కె.పి. పాలెం నార్త్‌కు చెందిన అల్లం అంజిబాబు వైఎస్సా ర్సీపీని వీడి ఈరోజు జనసేన పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ వారికి జనసేన పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ చేరవేసేందుకు అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.



రామాయణ కథ - శుద్ధపరబ్రహ్మ స్వరూప సాక్షాత్కార సాధనా సోపానములు

(గత సంచిక తరువాయి)

సాధకుడు బుద్ధియోగములో గురువులు నడచి చూపిన మార్గంలో పయనించుతూ ఉండగా తనలోని దశ ఇంద్రియ చలనము తనకు తెలియకుండానే ప్రకృతిని ఎత్తుకొని వెళ్ళి ఎక్కడ దాచియుంచాడో వెదకుటకు నిశ్చయించుకున్నాడు అని అంతరార్థం. దశేంద్రియములనగా కర్మేంద్రియములు ఐదు, జ్ఞానేంద్రియములు ఐదు. వాక్కు, పాణి, పాదములు, పాయువు, ఉపస్థ అనేవి కర్మేంద్రియములు. త్వక్కు, జిహ్వా, నేత్రములు, చెవులు, ముక్కు అనేవి జ్ఞానేంద్రియములు. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనేవి అంతరంగ చతుష్టయములు. మొత్తం ఈ 14 ఇంద్రియములను వశపరచుకొని చలనం లేకుండా నిశ్చలస్థితిని సాధకుడు సాధించినప్పటికినీ, అంతరాంతరములలో ఎక్కడనో ఉన్న (మాయ) దశేంద్రియ సంచలనశక్తి ఒక్కోసారి పుంజుకుని సాధకుని మోసగించి అతనిలోని భూసంబంధమైన ప్రకృతిని అపహరించి ఎక్కడనో దాచి వేచింది. దానిని వెదకుటకై సాధకుడు బుద్ధియోగంతో జ్ఞానమార్గంలో గురువులు నడచిన మార్గంలో పయనిస్తున్నాను అని అర్థం. బుద్ధియోగం అనాహతచక్రానికి సంబంధించినది. ఆ అనాహత చక్రం తర్వాత ఉన్నది, విశుద్ధ, అజ్ఞా, సహస్రార చక్రములు మూడు ఆనందముతో నిండియుంటది కనుక ఆ ఆనందాన్ని అందుకోవడానికి సాధన చేస్తూ పరమాత్మ సదృశుడౌతాడు. యోగమార్గంలో అనాహత చక్రంలోనికి కుండలినీశక్తిని నడిపించినపుడు కోటిమెరుపులకు సాటియైన సూర్యతేజస్సు కనపడుతుంది. సీతను వెదకుటకు ఆంజనేయుడు దక్షిణదిక్కుకు వెళ్ళినాడు. అనగా అర్థం హృదయకోశం యొక్క దక్షిణం వైపు పరమాత్మ యొక్క ఉనికిగా యోగులు గుర్తించియున్నారు. కావున ఆ స్థానమునకు యోగమార్గంలో పయనించడం జరుగుతుంది. దక్షిణదిక్కుకు అనగా దేహానికి అధోభాగమున మూలాధార చక్రం యున్నది. దానిలో నున్న కుండలినీశక్తిని నిద్రనుండి లేపి సహస్రారంలోనికి చేర్చుటకు కుంభకంతో యోగులు మూలాధారంలోనికి బుద్ధిని ప్రవేశింపచేస్తారు అని కూడా దక్షిణదిక్కుకు అంతరార్థంగా చెప్పుకోవాలి. కుంభకయోగంతో కుండలినీశక్తిని లేపి వెన్నుముక ద్వారా ఆ శక్తి పయనిస్తున్నప్పుడు త్రిగుణాలు నశిస్తాయి అనేది యోగరహస్యం, సాధకుని బుద్ధి, మనస్సు నిశ్చలస్థితి పొందుటచే హృదయ గుహాం తరాలలో నున్న కర్మవాసనలన్ని నశించిపోతాయి. సముద్రము అనగా ఆనందముతో గూడిన పరమాత్మగా చెప్పుకోవాలి. ప్రకాశరూప పరమాత్మ యొక్క నిజతత్వాన్ని చింతనము చేయుట అని కూడా అర్థం. ఆంజనేయుడు సముద్రము దాటి ఆవలితీరం చేరాడు అనగా భగవంతుని చింతన యొక్క సంపూర్ణజ్ఞానమును పొందడం అన్నమాట సాధకుడు అనగా ప్రకృతిని పరబ్రహ్మ స్వరూపముగా దర్శించుట అనుభవం పొందినవాడు అని అర్థం.

మైనాక పర్వత దర్శనం: సముద్రుని ఆదేశంతో మైనాకపర్వతం ఆంజనేయునికి మార్గమధ్యలో ఎదురుపడి తన మీద కొంచెం సేపు విశ్రాంతి తీసుకుని తన ఆతిథ్యాన్ని స్వీకరించి వెళ్ళవలసినదిగా కోరుతుంది. ఆంజనేయుడు అందుకు ఒప్పుకోక అతని శిరస్సును చేతితో నిమిరి బుజ్జగించి వదలి వేస్తాడు. ఇందులో అంతరార్థం ఏమనగా ముక్తిసాధనలో ఎన్నో లాభాల్ని కలిగించే సిద్ధులు సాధకునికి తమంత తాము వశమవుతాయి. కాని సాధకుడు వానిని స్వీకరిస్తే వాటి ప్రలోభంలో పడి అసలు సంగతి మరచి భ్రష్టుడవుతాడు. అందుచే ఆ సిద్ధుల భ్రమలకులోను కాకూడదని ఈ సంఘటన చెప్తుంది.

సురస ఆంజనేయున్ని బలపరీక్ష చేయుట :- దేవతలు 'సురస' అనే నాగమాతను రాక్షసిరూపంలో ఆంజనేయున్ని బలాన్ని పరీక్ష చేయడాన్కి పంపుతారు. సురస ఆంజనేయున్ని మ్రింగడాన్కి నోరు పెద్దదిగా చేస్తే ఆంజనేయుడు తన దేహాన్ని ఆమె నోరుకంటే పెద్దదిగా పెంచి, హఠాత్తుగా సూక్ష్మ రూపం ధరించి ఆమె నోటిలో ప్రవేశించి తిరిగి బైటకు వచ్చేస్తాడు. సురస అతని సూక్ష్మ బుద్ధికి ఆశ్చర్యపడి, మెచ్చుకుని దీవించి, తాను అతని బలపరీక్షార్థం దేవతలచే పంపబడిన నాగమాత అని చెప్తుంది. సురస అనగా 'సు' = చక్కన సుఖాన్ని కల్గించేటటువంటి, రస = రసములు అనగా జన్మవాసనల ప్రవృత్తి. ఆమెను దేవతలు పంపేరు అనగా సాధకునిలోని దివ్యజ్ఞానానికి సంబంధించిన మనోవృత్తులు. నాగమాత అనగా న + అగ = నాగ అనగా నిశ్చలత్వం లేకుండా చేసేది. నిశ్చలత్వాన్ని భంగపరచే వాసనలకు సంబంధించిన మనోవృతులు నాగములు అనిపించుకుంటాయి. నాగములకు మాత సురస అనగా నిశ్చలత్వాన్ని భంగపరచే నీచవృత్తులను సృష్టించే సుఖవాసనలు కలది అని అంతరార్థం. బ్రహ్మజ్ఞానాన్ని నాశనం చేసేది అని అర్థం. దుఃఖాలిచ్చే వాసనల వలె సుఖానిచ్చే వాసనలు కూడా బ్రహ్మజ్ఞానానికి ప్రతిబంధకాలే. సంకెళ్ళు ఇనుపవయినా, బంగారపువైనా బంధించడంలో సమానమే కావున ఆత్మజ్ఞానసాధకుడు సుఖదుఃఖముల వాసనలు వదలివేయాలి. సురస ఎంతగా నోరు తెరచినా ఆంజనేయుడు అంతగా శరీరాన్ని పెంచాడు అన్నదానికి అంతరార్థం లోకవాసనలు ఎంత ప్రలోభపెట్టినా వాటికి లొంగకపోవడం అని అంతరార్థం. అంటీముట్టని అసంగ యోగంతో (నిస్సంగత్వంతో) తామరాకు మీద నీటిబొట్టులా సుఖదుఃఖాల్ని అనుభవించడం అనే సాధనా రహస్యం ఇందులో గ్రహించాలి.

ఛాయాగ్రాహి నిగ్రహం :- సింహిక అనే ఛాయాగ్రాహి తాను సముద్రంలో కనిపించకుండా వుండి పై నుండి ఎగిరివెళ్ళుచున్న ఆంజనేయుని యొక్క నీడను ఆక్రమించి అతని గమనాన్ని ఆపివేసింది. కాని ఆంజనేయుడు ఏమీ కంగారుపడకుండా సముద్రం మీదకి దిగి ఆ ఛాయాగ్రాహిని ఒక తన్ను తన్ని నాశనం చేసి పైకెగిరి వెళ్ళాడు. ఇందులో అంతరార్థం ఏమనగా సాధనలో ఇదొక హఠత్తుగా జరిగే విఘ్నం. సాధకుని సాధనా తేజస్సునే ఛాయ అనాలి. ఆ కుచింపచేసే ప్రబలమైన ఆటంకమే ఛాయాగ్రాహి. సాధకుడు తనకు ఎదురైన ఆటంకాలను జ్ఞానదృష్టితో ఎదుర్కొని నివారించుకోవాలి అనేది ఇందులో రహస్యం. **(ఇంకా ఉంది)**

రచన :
పరిపూర్ణబోధాచార్య
గుర్రాల మోహనరావు ఆర్యులు
అధ్యక్షులు, శ్రీ భీంపల్లి గడ్డయ్యార్య
కేంద్ర భక్తసమాజం
విశాఖపట్టణం, సెల్ : 9848482843



బి. సావరం టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా జగడం సత్యనారాయణ

రాజోలు, నవంబర్ 21 (సత్య దీపిక ఉదయం విలేఖరి): బి. సావరం గ్రామ పంచాయతీ టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా జగడం సత్యనారాయణ పోటీలో ఉన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలంలోని బి.సావరం గ్రామంలో ఉన్నా ప్రజలతో సుధీర్గమైన రాజకీయ అనుబంధం, అనుభవ ప్రస్థానం జగడం సత్యనారాయణ సొంతం. బి.సావరం గ్రామంలో ఎన్నో కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలిచారు. గ్రామంలోని మెజారిటీ కుటుంబాలతో వ్యక్తిగత పరిచయాలు ఉన్నాయి. ఏదో ఒక రూపంలో జగడం సత్యనారాయణ సలహాలు, రాజకీయంగాను ఉపయోగించుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇవి ఆయనకు కలిసి వచ్చే అంశాలుగా ఉంటాయని స్థానికులు పేర్కొంటున్నారు. కుల నాయకుడుగా పదవి 0జూఉన్నా అన్ని సామాజిక వర్గాలకు మానవతావాదిగానే సహాయపడ్డారు. జగడం సత్యనారాయణ సలహాలతో సర్పంచ్ లు అయ్యారు. రాజకీయ పదవులు పొందారు, కార్పొరేషన్ లోన్స్ అందుకున్నారు. ప్రస్తుతం మెజారిటీ ప్రజలు జగడం సత్యనారాయణ సర్పంచ్ అయితేనే గ్రామ సమస్యలు పరిష్కారం అవుతాయని బి.సావరం గ్రామానికి జగడం సత్యనారాయణను నెగ్గించుకోవటం అవసరమని స్థానికులు



అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీ హరీష్ బాలయోగి, జిల్లా పరిషత్ చైర్మన్ గొల్లపల్లి అమూల్యలు జగడం సత్యనారాయణకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రచారంలో సర్పంచ్ అభ్యర్థిగా జగడం సత్యనారాయణ ముందంజలో ఉన్నారు. ఆయనకే గెలుపు వస్తుంది అని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

చలో ఢిల్లీ'కి వ్యవసాయ కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు!



ముమ్మిడివరం, నవంబర్ 21 (సత్య దీపిక ఉదయం విలేకరి) : కేంద్ర ప్రభుత్వం అను సరిస్తున్న ప్రజా, కార్మిక వృతి రేక విధానాలకు నిర సనగా డిసెంబర్ 1 నుండి 3 వరకు సిఐటియు ఆధ్వర్యంలో జరగనున్న 'చలో ఢిల్లీ' పార్లమెంట్ ముట్టడికి ఆంధ్రప్రదేశ్ వ్యవ సాయ కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సఖిలే సూర్యనా రాయణ తెలిపారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం పిలుపుమేరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడి వరం మండలం, గేదెలంక గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించి వ్యవసాయ కూలీలను నేరుగా కలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పెరిగి పోతున్న నిరు ద్యోగం, ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు, కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల పేదలు తీవ్రంగా నష్టపో తున్నారని, ఉపాధి హామీ పథకానికి నిధులు కోత పెడుతూ నీరు గార్చే కుట్రలను ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాల అమలు, ఉపాధి హామీ పని దినాల పెంపు కోసం ఢిల్లీ వేది కగా జరిగే ఈ చారిత్రాత్మక పోరాటాన్ని విజయవంతం చేయడానికి కూలీలంతా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పితాని లీలాకుమారి, గన్నవరపు రాంబాబు, శీలం చంద్రకుమారి, గుత్తుల సత్యవతి, కాశి దాదామణి, పితాని మంగమ్మ, కొప్పిశెట్టి దుర్గ, సలాది గోవిందరాజు, పితాని కనకదుర్గ, కొట్టూరి ఆదినారాయణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కూలీలు పాల్గొని నినాదాలు చేశారు.

మేకలకు మేత కోసం వెళ్లి అదృశ్యమైన భీమారావు.. ముమ్మరంగా గాలింపు

- కొసంగిపురం పరిసర ప్రాంతాల్లో కాశీబుగ్గ పోలీసులు, ఫైర్ సిబ్బంది తనిఖీలు



పలాస, నవంబర్ 21 (సత్య దీపిక ఉదయం బ్యూరో) : శ్రీకాకుళం జిల్లా పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మొగిలిపాడు గ్రామంలో వ్యక్తి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. గ్రామంలోని హరిజనవీధికి చెందిన టొక్క భీమారావు (51) ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో మేకలకు మేత తీసుకువస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. అయితే ఎంతసేపటికీ తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. భీమారావు భార్య మహాలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇళ్లతో పాటు పలు ప్రాంతాల్లో వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో ఈ నెల 21వ తేదీ తెల్లవారుజామున కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



కొసంగిపురం పరిసరాల్లో గాలింపు చర్యలు – అదృశ్యమైన భీమారావు ఆచూకీ కోసం కాశీబుగ్గ పోలీస్ సిబ్బంది, ఫైర్ సిబ్బందితో కలిసి కొసంగిపురం పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానిత ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ ఆయన ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది సమన్వయంతో గాలింపు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించండి. అదృశ్యమైన వ్యక్తి వివరాలు: – పేరు: టొక్క భీమారావు – తండ్రి పేరు: టొక్క జంగమయ్య – వయస్సు: 51 సంవత్సరాలు – చిరునామా: హరిజనవీధి, మొగిలిపాడు గ్రామం, పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ. టొక్క భీమారావును ఎక్కడైనా గుర్తించినా, ఆయన ఆచూకీకి సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే కాశీబుగ్గ పోలీసులకు తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 6309990825, 6309990857, ఒక వ్యక్తి ఆచూకీ కనుగొనేందుకు ప్రజలందరూ సహకరించాలని, ఈ సమాచారాన్ని విస్తృతంగా ఇతరులకు చేరవేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పంచాయతీ పోరుకు రంగం సిద్ధం!

14 పంచాయతీల్లో రసవత్తర పోరు.. రెండు ఏకగ్రీవం!

ముమ్మిడివరం, నవంబర్ 21 (సత్య దీపిక ఉదయం విలేకరి): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ముమ్మిడివరం మండలంలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల తుది అభ్యర్థుల జాబితాను అధికారులు శనివారం అధికారికంగా విడుదల చేశారు. మండలంలోని మొత్తం 16 గ్రామ పంచాయతీలకుగాను చిన కొత్తలంక మరియు గాడిలంక పంచాయతీలలో సర్పంచ్ మరియు వార్డు స్థానాలు పూర్తిగా ఏకగ్రీవం కాగా, మిగిలిన 14 పంచాయతీలలో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. ఈ 14 పంచాయతీలలో సర్పంచ్ పదవుల కోసం మొత్తం 40 మంది అభ్యర్థులు, 92 వార్డు స్థానాలకు అభ్యర్థులు బరిలో నిలిచారు. ముఖ్యంగా గెదేల్లంక పంచాయతీలో అత్యధికంగా 7 మంది, సిహెచ్. గున్నేపల్లిలో 5 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీ పడుతుండగా; కర్రివానిరేవు, కొత్తలంక, లంక ఆఫ్ ఠానేలంక, ఠానేలంక పంచాయతీలలో ముగ్గురు చొప్పున, మిగిలిన పంచాయతీలలో ద్విముఖ పోటీ నెలకొంది. మరోవైపు, కోమనపల్లి పంచాయతీలో వార్డులన్నీ ఏకగ్రీవం కావడంతో కేవలం సర్పంచ్ పదవికి మాత్రమే ఇద్దరు అభ్యర్థుల మధ్య పోటీ జరగనుంది. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసి తుది జాబితా వెలువడటంతో గ్రామాల్లో ఎన్నికల ప్రచారం వేడెక్కింది.

శ్రీకాకుళం ఎన్నికల ప్రచారంలో గౌతు శిరీష జోరు

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా వార్డుల్లో విస్తృత పర్యటన..

ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించిన ఎమ్మెల్యే



శ్రీకాకుళం నవంబర్ 21(సత్యదీపిక ఉదయం బ్యూరో) : శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చురుగ్గా పాల్గొన్నారు. కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా బరిలో ఉన్న జనసేన పార్టీకి చెందిన దానేటి రాధారాణితో పాటు వివిధ వార్డుల్లో పోటీ చేస్తున్న కూటమి కార్పొరేటర్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు.
ఈ సందర్భంగా అభ్యర్థులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే గౌతు శిరీష స్థానిక ప్రజలను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రచారంలో భాగంగా 6వ వార్డు నుంచి దండాసి జ్యోతి భాస్కర్, 12వ వార్డు నుంచి ముంగి జ్యోతి, 27వ వార్డు నుంచి బొల్ల ఆశస్విని, 33వ వార్డు నుంచి మద్ది భానుమతి, 49వ వార్డు నుంచి బుర్రి మధుసూదన్, 51వ వార్డు నుంచి తోట శ్రావణి తరఫున ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు.
ఈ సందర్భంగా గౌతు శిరీష మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. మేయర్ అభ్యర్థి దానేటి రాధారాణి, కార్పొరేటర్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సాగిన ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ పాఠశాలలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు



కొత్తపేట, నవంబర్ 20 (సత్య దీపిక ఉదయం ప్రతినిధి) – పలివెల, సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో అగ్నిప్రమాదాల నివారణ, భద్రతా చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు అగ్నిమపక సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐదుగురు అగ్నిమాపక శాఖ సిబ్బంది హాజరయ్యారు. ఫైర్ కానిస్టేబుల్ మహేష్ శంకర్, హెడ్ కానిస్టేబుల్ యశ్వే సందాని, కానిస్టేబుల్ కె.వి.పి. ప్రసాద్ తదితరులు విద్యార్థులకు అగ్నిప్రమాదాలకు గల కారణాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు, గ్యాస్ లీకేజీల వల్ల కలిగే ప్రమాదాలు, వాటి నివారణ చర్యలనువివరించారు. అత్యవసర పరిస్థితుల్లో భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా వ్యవహరించడం, సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడం, అగ్నిమాపక శాఖకు 101 నంబర్ ద్వారా సమాచారం అందించడం వంటి ముఖ్యమైన సూచనలు చేశారు. అగ్నిమాపక పరికరాల వినియోగం, ప్రాణ రక్షణలో ముందస్తు జాగ్రత్తల ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెవ. సిస్టర్ సునీత , ఇతర సిస్టర్స్ మరియు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అగ్నిప్రమాదాల పట్ల అవగాహనతో పాటు అప్ర మత్తత, సమయస్ఫూర్తి, భద్రతా బాధ్యతలపై విలువైన జ్ఞానం లభించిందని. ఈ సదస్సు ల ద్వారా విద్యార్థి దశనుండే ఎంతోవిలువైన సమయస్ఫూర్తి, ప్రమాదాలను ఎదుర్కొనే ధైర్యం లభిస్తుందని ప్రిన్సి పాల్ అభిప్రాయపడ్డారు. అగ్నిమపాక సిబ్బందికి హృదయ పూర్వక అభినందనలు ధన్యవాదములు తెలియజేసారు.ఈ సందర్భంగా అగ్ని మపాక సిబ్బంది చక్కటి స్లోగన్ తో వారి సదస్సులో అప్రమత్తత మన బాధ్యత -- భద్రత మన హక్క తెలియజేసి ముగించారు.

కేంద్ర ఉక్కుశాఖ మంత్రి శ్రీనివాస వర్మతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రమణబాబు భేటీ



రాజమహేంద్రవరం, **నవంబర్ 21 (సత్యదీపిక ఉదయం విలేకరి) :** మేయర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రావణబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మంత్రిని కలిసి రాజకీయ, స్థానిక అంశాలపై మాట్లాడారు. ఈ భేటీలో అమలాపురం మున్సిపాలిటీ 28వ వార్డు కౌన్సిలర్, బీజేపీ సీనియర్ నాయకులు మోకా వెంకట సుబ్బారావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొర్రా చిట్టిబాబు, టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి పుల్లయ్య నాయుడు, గంధం శ్రీను తదితరులు పాల్గొన్నారు. మేయర్ ఎన్నికల ప్రచార నేపథ్యంలో కేంద్ర మంత్రితో కూటమి నాయకుల ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

మున్సిపల్ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే పంతం నానాజీకి ఆహ్వానం



కాకినాడ, నవంబర్ 21 (సత్యదీపిక ఉదయం విలేకరి) : అమలాపురం మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న నల్లా శ్రీధర్ శనివారం కాకినాడలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమలాపురం మున్సిపల్ చైర్మన్‌గా నిర్వహించనున్న తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే పంతం నానాజీని ఆహ్వానించారు. అనంతరం అమలాపురం పట్టణ అభివృద్ధి, మున్సిపల్ పరిపాలనకు సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా అమలాపురం మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న నల్లా శ్రీధర్‌కు పంతం నానాజీ అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయ అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా జడ్జి ఏ.వాసంతి



నర్సాపురం నవంబర్ 21 (సత్యదీపిక ఉదయం విలేకరి) – విద్యార్థులందరు చట్టాలు తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ రోజు ఎల్. బి చర్ల లోని బాలుర గురుకుల పాఠశాల, నర్సాపురంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ మరియు లక్ష్మనేశ్వరంలోని బాలికల గురుకుల పాఠశాల లందు నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమాల్లో నర్సాపురం పదవ అదనపు జిల్లా జడ్జి ఎ. వాసంతి బాలికల గురుకుల పాఠశాల, సీనియర్ సివిల్ జడ్జి జి. గంగరాజు, బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. వరలక్ష్మి శ్రీ చైతన్య స్కూల్ లందు పాల్గొన్నారు. న్యాయమూర్తులు విద్యార్థు లకు పోక్సో చట్టం, మోటార్ వాహన చట్టం, చైల్డ్ మ్యారేజ్ చట్టం, మాదక ద్రావ్యాల దుర్వినియోగం చట్టం, జూవేనైల్ జస్టిస్, టోల్ ఫ్రీ నెం. 112, 1098, 15100 ల గురించి వివరించారు. ఫేసుబుక్, ఇంస్ట్రా లో ప్రలోబా లకు గురై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. అబ్దుల్ కలాం, బాబా సాహెబ్ అంబేద్కర్, జ్యోతి రావు పూలే,వంటి మహనీయుల జీవిత చరిత్రలు చదవాలని, రోజు న్యూస్ పేపర్ చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులను వదిలి ఎంతో దూరం నుండి వచ్చి హాస్టల్ ఉన్న విద్యార్థులు ఉన్నతమైన స్థితికి చేరాలని, లక్ష్యసాధనతో గమ్యం చేరేవరకు కష్టపడాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఐ. జాన్ కెనడి, కార్యదర్శి కె. సోమశేఖర్, లీగల్ సర్వీసెస్ సభ్యులు దానయ్య నాయుడు, ఎ. జి. పి కరుణ్ కుమార్, పానేల్ లాయర్లు చిట్టీ పద్మజ, శిరీష, గ్రామీణ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు, పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ఎ ముత్యాలరావు, మొగల్తూరు సబ్ ఇన్స్పెక్టర్ జయ లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు ఎన్. శ్యాం ప్రసాద్, ఎన్. మోనికా, బి. వేణు గోపాల్ రావు, కోర్ట్ లైజన్ మూర్తి, కాన్స్టేబుల్స్ గంగరాజు, శ్రీనివాసరావు, పి. ఎల్. వి., దుర్గ ప్రసాద్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పేరూరు సర్పంచ్ బరిలో ప్రముఖ న్యాయవాది చొల్లంగి సుబ్బిరామ్!



అమలాపురం, నవంబర్ 21 (సత్య దీపిక ఉదయం విలేకరి) : అమలాపురం మండలం పేరూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ప్రముఖ న్యాయవాది చోల్లంగి సుబ్బిరామ్ ఎన్నికల బరిలో నిలిచారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గతంలో వివిధ పదవులు నిర్వహించిన ఆయనకు గ్రామంలో సౌమ్యుడిగా, వివాదరహిత వ్యక్తిగా మంచి గుర్తింపు ఉంది. గత ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన ఆయనకు, ఈసారి మరోసారి ప్రజాక్షేత్రంలోకి రావడంతో గత ఎన్నికల అనుభవం, అప్పటి పరిణామాలు అనుకూలంగా మారాయి. ఈ నేపథ్యంలో శనివారం తోట్లపాలెంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాది మంది కార్యకర్తలు, అభిమానులు ఆయన వెంట నడుస్తూ తమ మద్దతు ప్రకటించారు. మహిళలు హారతులు పట్టి పూలతో ఘన స్వాగతం పలికారు. ప్రచార ప్రారంభ కార్యక్రమం సందడిగా సాగింది.
సుబ్బిరామ్‌కు గ్రామంలో ఉన్న వ్యక్తిగత పరిచయాలు, గతంలో నిర్వహించిన రాజకీయ బాధ్యతలు, సౌమ్య స్వభావం వంటి అంశాలు స్థానికంగా చర్చకు వస్తున్నాయి. గత ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో ఈసారి ఆయనకు సానుభూతి కూడా కలిసివస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పేరూరు సర్పంచ్ ఎన్నికపై గ్రామంలో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ దాసరి అరుణ దేవిడ్, దొంగ ఆంజనేయులు, అప్పారీ సూరిబాబు, నాగబత్తుల బాలకృష్ణ, బడుగు వెంకటరమణ, చోల్లంగి శ్రీనివాసరావు, చిట్టిమెను వెంకటరమణ, ఉటాల చిన్న, కొప్పిశెట్టి ప్రసాద్, పిల్లా నాని, మోటూరి చంద్రతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.











జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/26/A4267

సత్య దీపిక

ఉదయం

www.satyadeepikaudayam.com

తెలంగాణ ప్రజల గొంతుక ..నిజాలు వెలుగుల్లోకి

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి
- ఆదిలాబాద్ పట్టణంలో సుమారు 3 వేల మందికి కొత్త చేయూత పింఛన్లు..
- జిల్లావ్యాప్తంగా 14,549 మంది అర్హుల గుర్తింపు
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో తొలిరోజే 5,536 కుటుంబాల నమోదు

ఆదిలాబాద్ ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించి ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్



రెడ్డి అన్నారు. గతంలో వివిధ కారణాలతో పింఛన్లు పొందలేక ఇబ్బందులు పడుతున్న అర్హులను గుర్తించి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్టీయూ భవన్ హాల్‌లో గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను ఆలపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో పింఛన్లు అందక ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహించినట్లు తెలిపారు.

⇨ 8

పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

- పురపాలక శాఖ ప్రతిపాదనలపై

ఉన్నతస్థాయి సమీక్ష

నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సత్యదీపిక ఉదయం :

రాష్ట్రంలో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి పురపాలక శాఖ రూపొందించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. వాతావరణ మార్పులను తట్టుకునేలా, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా పట్టణాలను అభివృద్ధి చేసే ప్రణాళికలపై చర్చించారు. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ADB), ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడుల బ్యాంకు (AIIB , జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ (KFW) బ్యాంకుతో పాటు దేశీయ ఆర్థిక సంస్థల సహకారంతో దాదాపు రూ. 20 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేందుకు పురపాలక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వరంగల్ నగర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వర్షపు నీటి పారుదల వ్యవస్థ, వరంగల్ కోట చుట్టూ ఉన్న కందకం పునరుద్ధరణ, హనుమకొండలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ అభివృద్ధి ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తున్నారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు, ప్రధానంగా టెక్స్‌టైల్ పార్కులకు వినియోగించడం ద్వారా



మంచినీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు అవకాశముంది. పట్టణాల్లో తాగునీటి సరఫరా, నీటి శుద్ధి, పంపిణీ వ్యవస్థల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించడంపై ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. వరంగల్ మెగా సిటీ ఎకనామిక్ రీజియన్ పరిధిలో వ్యర్థాల నుంచి 10 నుంచి 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను సమీక్షించారు. బయో సీఎన్‌జీ ఉత్పత్తి, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుపై చర్చించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా పట్టణాల్లో కర్బన ఉద్గారాలను తగ్గించడం, నీటి వనరులను సంరక్షించడం, వరద ముప్పును నివారించడం, పురపాలక సంస్థల నిర్వహణ వ్యయాన్ని తగ్గించడం లక్ష్యంగా నిర్దేశించారు.

కళా సాహిత్యాలకే కాళోజీ కళాక్షేత్రం!

- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



హైదరాబాద్ , సత్యదీపిక ఉదయం

ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మారకంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని కళా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకే కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని ఆదేశించారు. కాళోజీ కళాక్షేత్రంలోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తున్నారనే వార్తల నేపథ్యంలో శనివారం ముఖ్యమంత్రి స్పందించారు. కళాక్షేత్రంలోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలించవద్దని ఆదేశించారు. కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో చర్చించి కళాక్షేత్రంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను ఖరారు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

సీపీఆర్ నేర్చుకోండి.. ప్రాణాలు కాపాడండి

- ప్రాణరక్షణలో సీపీఆర్ కీలకం
- పోలీస్ కమిషనర్

గోదావరిఖని,సత్యదీపిక ఉదయం :

అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు హృదయ-శ్వాస పునరుద్ధరణ (సి పి ఆర్)పై ప్రతి ఒక్కరి కి ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా వైద్య విద్యార్థులు, పోలీసు సిబ్బందితోపాటు సుమారు 1000 మంది విద్యార్థులకు రామగుండంలోని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)లో డాక్టర్ శివరంజని సంతోష్ సీపీఆర్ పై సులువుగా అర్థమయ్యేలా శిక్షణా ఇచ్చారు. గుడ్ విల్ ఫౌండేషన్ తెలంగాణ సహకారంతో నిర్వహించిన సిపిఆర్ శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ప్రమాదాలు,ఆకస్మిక గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో బాధితుడికి వైద్య సహాయం అందేలోపు సీపీఆర్ చేయడం ఎంతో కీలకమని తెలిపారు. సరైన సమయంలో, సరైన పద్ధతిలో సీపీఆర్ అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు. సీపీఆర్ శిక్షణను కేవలం తమపని ప్రదేశంలోనే కాకుండా, బయట కూడా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.





ధైర్యంగా స్పందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తొలి స్పందన చాలా ముఖ్యమని, వైద్య సహాయం అందేలోపు సీపీఆర్ అందించడం ద్వారా ఒక ప్రాణాన్ని నిలబెట్టే అవకాశం ఉంటుందని సీపీ తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, పోలీస్ సిబ్బందికి సీపీఆర్ ప్రాథమిక విధానాలను వివరించి, డమ్మీపై ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. విద్యార్థులు, పోలీస్ సిబ్బందితో కలిసి సీపీ స్వయంగా సీపీఆర్ చేస్తూ శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, డాక్టర్ దయాల్ సింగ్, డాక్టర్ హిమబిందు, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ లింగమూర్తి, ఆర్ఐ శేఖర్, ఎస్ఐలు మనోహర్, రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

కల్పించాలి

- షిఫ్టెడ్, అబ్సెంట్ ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించాలి -
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

మంచిర్యాల ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

అర్హులైన ఓటర్లెవరూ ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులతో ఓటర్ల జాబితా ప్రత్యేక



సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, షిఫ్టెడ్ (నివాసం మారిన), అబ్సెంట్ (అందుబాటులో లేని) ఓటర్ల విషయంలో బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాలతో పాటు మరోసారి క్షేత్రస్థాయికి వెళ్లి సంబంధిత ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అర్హులైన ఓటర్లు ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటు హక్కు పునరుద్ధరణకు లభించిన ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా రాజకీయ పార్టీలు, మీడియా, బూత్ స్థాయి ఏజెంట్లు, బూత్ స్థాయి అధికారుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే ప్రచారం చేసినప్పటికీ దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోయిన అర్హులైన ఓటర్లను గుర్తించి, వారికి మరోసారి అవగాహన కల్పించాలని తెలిపారు. ఎ.ఎస్.డి.డి. జాబితాలో



ఉన్నప్పటికీ నివాసం మారని ఓటర్లు నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించవలసిన అవసరం లేదని, నివాసం మారిన వారు మాత్రం ఎన్యుమరేషన్ ఫారంతో పాటు అనాక్సర్-సి సమర్పించాలని వివరించారు. ఈ ప్రక్రియపై సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, బూత్ స్థాయి అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు .

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1 లక్ష 14 వేల 468 మంది ఓటర్లకు సంబంధించిన వివరాలు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని సింగరేణి ప్రాంతాలలో ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు బదిలీ కావడం, ప్రజలు నివాసాలు మారడం వంటి కారణాలతో షిఫ్టెడ్ ఓటర్ల సంఖ్య అధికంగా ఉందని, మరణించిన ఓటర్లకు సంబంధించిన కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ వివరాలను అనుబంధ జాబితాతో సహా ముద్రించి మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, వాస్తవ వివరాలను నిర్ధారిస్తామని తెలిపారు. ముసాయిదా జాబితా అనంతరం క్లెయిమ్స్, అబ్జెక్షన్స్ సమయంలో పేర్లు తొలగించబడిన కొందరు ఓటర్లు ఫారం-6 సమర్పించారని, వాటికి సంబంధించిన వివరాలను మరోసారి పరిశీలించి అర్హులైన వారి పేర్లను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రత్యేకంగా బెల్లంపల్లి, మంచిర్యాల, క్యాతనపల్లి, మందమర్రి పట్టణ ప్రాంతాలలో సింగరేణి ఉద్యోగుల బదిలీలు, నివాస మార్పుల కారణంగా ఓటర్ల వివరాలలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలసదన పిల్లలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

బాలసదనంలో వసతి పొందుతున్న పిల్లలందరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జాతీయ బాలల దినోత్సవం వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్ గ్రామంలో గల బాలసదనాన్ని సందర్శించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన బాలసదనంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలందరికీ అన్ని వసతులు కల్పించాలన్నారు.



చిన్నారులతో నేరుగా మాట్లాడి వారి వివరాలు, బాలసదనంలో సౌకర్యాలు, ఇంకా ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో అని, వారి జీవిత లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే అధికారులకు తెలియజేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలని తెలిపారు. బాలసదనం అధికారులతో మాట్లాడుతూ, చిన్నారులకు ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అందరూ తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులను ఇతర రాష్ట్రాలకు విమానాల్లో సందర్శనకు తీసుకువెళ్లాలని సూచించారు. ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో వారికి సందేశాత్మకమైన, వారి మనోస్థైర్యం నింపేలా మంచి మంచి సినిమాలను ప్రదర్శించాలన్నారు. ఆటలు ఆడించాలన్నారు. వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించి వారిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. త్వరలోనే సొంత భవనంలోనికి బాలసదనాన్ని మారుస్తామని హామీ ఇచ్చారు. చిన్నారులతో కేకు కట్ చేయించి, వారికి కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వినూత్న, అధికారులు మురళి, వైష్ణవి, రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా..

ఇందిరమ్మ బీమా

- జిల్లా కలెక్టర్ కె.హరిత

అసిఫాబాద్ ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హత గల ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత, ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మీ, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ చైర్ పర్సన్లు మెంగ్రే ఆకాష్, సహిన్ సుల్తానా, ఆసిఫాబాద్ మార్కెట్



కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కామ్దే అనిల్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి. అహ్మద్ లతో కలిసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

⇨ 8

లోకేశ్వరంలో భక్తిశ్రద్ధలతో శివ మహాపురాణం

లోకేశ్వరం సత్య దీపిక ఉదయం న్యూస్

లోకేశ్వరం మండల కేంద్రంలోని శుభమస్తు కల్యాణ మండపంలో లోకేశ్వరం భక్తుల ఆధ్వర్యంలో శివ మహాపురాణం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ ఫణితుల మేఘరాజ్‌శర్మ శివ మహాపురాణంలోని వివిధ ఘట్టాలు, శివతత్వాన్ని భక్తి భావంతో భక్తులకు అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నారు. శివ మహాపురాణం ప్రవచనాలు వినేందుకు స్థానిక భక్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసంలో శివ మహాపురాణం నిర్వహించడం శుభసూచికమని భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శివ పురాణం వినడం వలన మనసులోని భయాందోళనలో తొలగిపోయి ప్రశాంతత చేకూరుతుందని,ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందుతుందన్నారు. కుటుంబంలో ఐక్యత,సుఖ సంతోషాలు,సానుకూల దృక్పథం ఏర్పడడమే కాకుండా మానవ జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఎలా ఎదురుకోవాలి,జన్మను సార్థకతకు ధర్మబద్ధంగా ఎలా జీవించాలో శివపురాణం చెప్తుందని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతుల ఏర్పాటుతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్తీక పూర్ణిమ సోమవారం రోజున శివపార్వతుల కళ్యాణం ఉంటుందని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సృష్టికి తల్లిదండ్రులైన శివ పార్వతుల కృపకు పాత్రులవ్వాలని నిర్వాహకులు పేర్కొన్నారు.



అమృత్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి - రిజర్వాయర్ల నిర్మాణంలో మరింత వేగం పెంచాలి.. అదనపు కార్మికులను నియమించాలి

ఆదిలాబాద్ ,సత్యదీపిక ఉదయం :

ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నిరంతర తాగునీటి సరఫరా కల్పించేందుకు అమృత్ పథకం కింద చేపట్టిన పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల అమలులో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డికి పలువురు చైర్మన్లు, కౌన్సిలర్లు పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యలు, అమృత్ పథకం పనుల పురోగతిపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, సంబంధిత అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమృత్ పథకం కింద చేపట్టిన తాగునీటి సరఫరా పనుల



వివరాలను సలహాదారుకు వివరించారు. ఇందులో భాగంగా పట్టణంలో సుమారు 80 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులు పూర్తికావస్తున్నాయని, 9 వేల గృహాలకు సర్వీస్ కనెక్షన్లు కల్పించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అలాగే పట్టణంలో మొత్తం 9 ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, ఇటీవల నాలుగు రిజర్వాయర్ల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. మిగిలిన ఐదు రిజర్వాయర్ల పనులను కూడా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.అదేవిధంగా పట్టణ మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టనున్న మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.పనుల పురోగతిపై సమీక్షించిన ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, కాంట్రాక్టర్లకు నిధుల కొరత లేకుండా బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ రిజర్వాయర్ల నిర్మాణ పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను నామమాత్రంగా కొనసాగించడం కాకుండా, అవసరమైన మేరకు అదనపు కార్మికులను నియమించి నిర్మాణ వేగాన్ని పెంచాలని ఆదేశించారు.ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పైప్‌లైన్ పనులు, సర్వీస్ కనెక్షన్లు, రిజర్వాయర్ల నిర్మాణం, ఎస్టీపీ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి పనికి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించి, నిర్ణయించిన గడువులోగా పూర్తి చేసేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. అమృత్ పథకం పనులు పూర్తయితే ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరాతో పాటు మురుగునీటి నిర్వహణ వ్యవస్థ కూడా అందుబాటులోకి వస్తుందని పేర్కొంటూ, ఈ పనులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ప్రభుత్వ సలహాదారు ఆదేశించారు.

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి
- ఆదిలాబాద్ పట్టణంలో సుమారు 3 వేల మందికి కొత్త చేయూత పింఛన్లు..
- జిల్లావ్యాప్తంగా 14,549 మంది అర్హుల గుర్తింపు - ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో తొలిరోజే 5,536 కుటుంబాల నమోదు

మొదటి పేజీ తరువాయి...

పింఛన్ల కోసం దరఖాస్తులను పరిష్కరించి అర్హులకు పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూస్తున్న పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏ శాఖలోనైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వాటిని గుర్తించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడే ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు.గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ప్రభుత్వం కార్డులు మంజూరు చేస్తోందన్నారు. పేదలకు సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహ వినియోగానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయ వివక్షకు తావులేకుండా అర్హులందరికీ ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టం చేశారు.మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, డ్వాక్రా మహిళలు కుట్టే పాఠశాల యూనిఫాంలకు గతంలో మీటరుకు రూ.50 చెల్లించగా ప్రస్తుతం రూ.75కు పెంచినట్లు తెలిపారు. భవిష్యత్తులో మహిళలకు నాణ్యమైన చీరలు, పిల్లలకు దుస్తులు అందించే చర్యలు చేపడతామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని, విద్య ద్వారానే కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని సూచించారు.

జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఆదేశాల మేరకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పింఛన్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో కొత్త



పింఛన్ల కోసం సుమారు 15 వేల దరఖాస్తులు అందగా, క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి 14,549 మంది అర్హులను గుర్తించినట్లు వెల్లడించారు.దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాలు అందించేందుకు జిల్లావ్యాప్తంగా 28 ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. కొన్ని ధ్రువపత్రాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి మరో వారం నుంచి 15 రోజుల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్హులందరికీ ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. పెండింగ్ ప్రక్రియను పూర్తి చేసి వచ్చే నెల నుంచి అర్హులకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 80 నమోదు శిబిరాలు ఏర్పాటు చేయగా, తొలిరోజే 5,536 కుటుంబాలను నమోదు చేసినట్లు వెల్లడించారు. కుటుంబ యజమాని మరణించిన సందర్భంలో నామినీలకు రూ.5 లక్షల బీమా పరిహారం అందేలా ఈ పథకాన్ని రూపొందించినట్లు వివరించారు.ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోనూ నాలుగు శిబిరాలను ప్రారంభించి విడతలవారీగా అన్ని వార్డులు, కాలనీల్లో నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వార్డు అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వార్డు కౌన్సిలర్లు, సూపర్‌వైజర్ల సమక్షంలో నమోదు చేపడుతున్నామన్నారు. అర్హులైన కుటుంబాలు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నంబరుతో పాటు కుటుంబ యజమాని, నామినీ వివరాలను నమోదు కోసం తీసుకురావాలని సూచించారు. బీమా మొత్తంలో నామినీలకు కేటాయించాల్సిన వాటాలను కూడా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. నమోదు పూర్తయిన అనంతరం సంబంధిత మొబైల్ నంబరుకు ట్రాన్సాక్షన్ ఐడీ సందేశం వస్తుందని వివరించారు.ఎన్నికల తర్వాత ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రభుత్వం ప్రజలందరిదని, ఓటు వేసిన వారితో పాటు ఓటు వేయని వారికి కూడా సమానంగా సేవ చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమన్నారు.భర్తను కోల్పోయిన మహిళలు, దివ్యాంగులు, తలసేమియా బాధితులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, డయాలసిస్ చేయించుకుంటున్న నిరుపేదలు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆరోగ్య సమస్యలు ఎంతో బాధాకరమన్నారు. ఇలాంటి వారికి పింఛన్ ఎంతో అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. గత ఏడెనిమిదేళ్లుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న సుమారు నాలుగున్నర లక్షల మంది అర్హులకు పింఛన్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు. పింఛన్ కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, వృద్ధులు, దివ్యాంగులు, అభాగ్యులు ఆత్మగౌరవంతో జీవించేందుకు కల్పించే భరోసా అని అభిప్రాయపడ్డారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అసెంబ్లీలో చర్చ జరిగినప్పటికీ, పేదల కష్టాలు, అవసరాలను దృష్టిలో ఉంచుకొని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాల్సిన అవసరాన్ని సభలో ప్రస్తావించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అన్నారు.ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి, మంత్రులు, కేంద్ర ప్రభుత్వ పెద్దలు, ప్రధానమంత్రిని కలిసి నియోజకవర్గానికి అవసరమైన నిధులు, అభివృద్ధి పనుల కోసం కృషి చేస్తున్నట్లు పాయల్ శంకర్ తెలిపారు. ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు, పారిశ్రామిక పార్కు అభివృద్ధి వంటి కీలక అంశాల సాధనకు నిరంతరం ప్రయత్నిస్తున్నానన్నారు.జిల్లాకు పరిశ్రమలు వస్తే యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఆర్థికాభివృద్ధికి బాటలు పడతాయని పేర్కొన్నారు. తనపై ఎవరెన్ని విమర్శలు చేసినా పట్టించుకోనని, ఆదిలాబాద్ అభివృద్ధి చెందడం, ప్రజల జీవితాల్లో మార్పు రావడమే తనకు ముఖ్యమన్నారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలపవచ్చన్నారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యాలుగా నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ.. భర్తలను కోల్పోయి, ఆర్థిక ఇబ్బందులతో ఏళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూస్తున్న నిరుపేద మహిళలకు చేయూత పింఛన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో సుమారు మూడు వేల మందికి కొత్త పింఛన్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు.పట్టణంలో ఇంకా అనేక నిరుపేద కుటుంబాలు సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాయని, ఇప్పటివరకు ఇళ్లు పొందని అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వ పెద్దలను కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వారి అవసరాలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అతిథులు పథకం బ్రోచర్లను అందజేశారు. చేయూత పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ మల్లెపూల నరసయ్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్బిన్ అందన్, ఆత్మ చైర్మన్ సంతోష్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్ర, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, డీఆర్‌డీఏ పీడీ రాథోడ్ రవీందర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

.. ఇందిరమ్మ బీమా

- జిల్లా కలెక్టర్ కె.హరిత

మొదటి పేజీ తరువాయి....

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించే విధంగా 5 లక్షల రూపాయల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించిందని తెలిపారు. జిల్లాలో 1 లక్ష 65 వేల రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలకు మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామపంచాయతీలలోని 411 ప్రదేశాలలో శిబిరాలు నిర్వహించి, ప్రతి ఒక్కరి నుండి భీమా దరఖాస్తులు స్వీకరించి వివరాలను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డులు లేని వారికి త్వరలో రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఎలాంటి ప్రీమియం చెల్లించకుండా, ఎలాంటి దృవపత్రాలు అవసరం లేకుండా కేవలం రేషన్ కార్డు నెంబరు ఉంటే కుటుంబ సభ్యుల సమ్మతితో కుటుంబంలో గల 18 నుండి 59 సంవత్సరాల వయసు గల వారిలో ఒకరికి బీమా చేయించుకుని, నామిని వివరాలను దరఖాస్తులో నింపితే సరిపోతుందని తెలిపారు. జిల్లాలో ఈ పథకంపై ప్రజలందరికీ తెలిసే విధంగా టామ్ టామ్, గోడ ప్రతులు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

శాసనమండలి సభ్యులు మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నినదించిన గరీబీ హటావో కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి వర్తించేలా సామాజిక భద్రత, ఆర్థిక భరోసా అందించాలనే ఆలోచనతో ఈ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. ప్రభుత్వం ప్రారంభించే ప్రతి పథకంలో మహిళలకు పెద్దపీట వేస్తుందని, జిల్లా ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఆసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రతి అర్హత కుటుంబానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తులు స్వీకరించే శిబిరాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించి, పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకాలు 100 శాతం అర్హులైన లబ్ధిదారులకు అందిన అధికారులకు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



నీల్వాయి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ

- రాష్ట్ర సరిహద్దు, మారుమూల ప్రాంతం కావడంతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి: మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్

మంచిర్యాల,సత్యదీపిక ఉదయం :

మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ శనివారం మంచిర్యాల జోన్ పరిధిలోని నీల్వాయి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు,కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణకు



తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, నీల్వాయి పోలీస్ స్టేషన్ రాష్ట్ర సరిహద్దులోని మారుమూల ప్రాంతంలో ఉండటంతో పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రాష్ట్ర సరిహద్దుల గుండా జరిగే అక్రమ రవాణా,ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదేశించారు.రౌడీషీటర్లు,ట్రబుల్ మంగర్స్‌తో పాటు గతంలో వివిధ నేరాలకు పాల్పడిన వ్యక్తుల కదలికలను నిరంతరం గమనిస్తూ వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో వారి నివాసాలను తరచూ ఆకస్మికంగా తనిఖీ చేస్తూ,ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని,ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ,విధుల్లో క్రమశిక్షణ, పారదర్శకత, బాధ్యతాయుతమైన పనితీరును కనబరచాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ,ఎస్ఐ నాగరాజు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



- చేయూత పెన్షన్లు, ఇందిరమ్మ కుటుంబ బీమాతో నిరుపేదలకు ఆర్థిక భరోసా- బజార్‌హత్నూర్‌లో ఘనంగా నూతన పెన్షన్ మంజూరు పత్రాలు, కుటుంబ బీమా పత్రాల పంపిణీ కార్యక్రమం-ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి,లిజిల్లా కలెక్టర్ రాజర్షి షా

అదిలాబాద్ ప్రతినిధి, సత్యదీపిక ఉదయం :

ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు అండగా నిలిచి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి అన్నారు. పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేయూత ఆసరా పెన్షన్లు, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.బోథ్ నియోజకవర్గంలోని బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమం, సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఎలాంటి పైరవీలకు అవకాశం లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఈ పథకం నిరుపేద కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలుస్తుందని అన్నారు.

స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ, వెనుకబడిన బోథ్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు గిరిజన, మారుమూల ప్రాంతాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నియోజకవర్గంలో కొత్తగా అర్హులైన వారికి చేయూత పెన్షన్లు మంజూరు కావడం సంతోషకరమని పేర్కొన్నారు. పెన్షన్ల ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన నిరుపేదలకు ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో అర్హులైన ప్రతి కుటుంబం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న ప్రత్యేక నమోదు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.



జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 14,579 నూతన పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఇందులో బోథ్ నియోజకవర్గ పరిధిలో సుమారు 6 వేల పెన్షన్లు, బజార్‌హత్నూర్ మండలంలో 600కు పైగా పెన్షన్లు ఉన్నాయని వివరించారు. క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన పూర్తి చేసి అర్హులైన వారికి పెన్షన్లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. సదరం ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి ఈ నెలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయిన వారికి వచ్చే నెల నుంచి పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియ ప్రారంభమైన ఒక్క రోజులోనే జిల్లావ్యాప్తంగా 80 ప్రత్యేక శిబిరాల ద్వారా 5,536 కుటుంబాలను నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నెల రోజుల్లోగా అర్హులైన కుటుంబాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ పథకంలో నమోదు చేసుకునేందుకు కుటుంబ సభ్యులు ఓటరు గుర్తింపు కార్డు లేదా రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలకు హాజరైతే సరిపోతుందని స్పష్టం చేశారు. ఇందుకోసం మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. కుటుంబ యజమాని మరణించిన సందర్భంలో నామినీకి రూ.5 లక్షల బీమా ఆర్థిక సహాయం అందించే ఈ పథకంలో అర్హులైన ప్రతి కుటుంబం నమోదు చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



అనంతరం ముఖ్య అతిథులు పలువురు లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలు, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పత్రాలను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పరచ సాయన్న, డీఆర్‌డీఓ రవీందర్ రాథోడ్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో మహేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో పేదలకు ఆర్థిక భరోసా:డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ

ఆసిఫాబాద్ ,సత్యదీపిక ఉదయం :

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, ఆపద సమయంలో అండగా నిలవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని డీసీసీ అధ్యక్షురాలు



ఆత్రం సుగుణక్క తెలిపారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రచారంలో భాగంగా శనివారం డీసీసీ కార్యాలయంలో బీమా పథకం పోస్టర్లు, కరపత్రాలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి సుగుణక్క ఆవిష్కరించారు. అనంతరం సుగుణక్క మాట్లాడుతూ కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రూ.5 లక్షల జీవిత బీమా అందించడమే ఈ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.భూమి, ఆస్తులు లేని కుటుంబాలకు సైతం జీవిత బీమా భరోసా కల్పించాలనే గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని తీసుకొచ్చారని పేర్కొన్నారు. 18 నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన వారు ఈ పథకంలో నమోదు చేసుకోవాలని, కుటుంబంలో ఎవరిని ప్రధాన సభ్యుడిగా ఎంపిక చేసుకోవాలో వారే నిర్ణయించుకోవచ్చని సూచించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్‌తో హెల్ప్ డెస్క్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డు లేని అర్హులైన కుటుంబాలను సైతం గుర్తించి పథకంలో భాగస్వాములను చేయాల్సిన బాధ్యత సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు ఉబేద్ బిన్ యహియా (తారిక్),ఆసిఫాబాద్ మండలం అధ్యక్షుడు రావర్తి మురళి,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు రత్నం ఆనంద్,నియోజకవర్గం అధ్యక్షులు జాడే ప్రసాద్,చిట్ల నారాయణ, సంతోష్, పెంటు,సతీష్, అబ్దుల్, మధు, సత్యనారాయణ, గణేష్, ఆనంద్ రావు, బీమ్ రావు,జానకిరామ్, రాము తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో అధ్యయనం చేయాలి

ప్రభుత్వ పథకాల అమలు, ప్రజల సమస్యలను

- అటవీ హక్కుల పట్టాలు, గిరిజనుల గృహ నిర్మాణాలు, సాగునీటి వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి- 22 నుంచి 25 వరకు గ్రామీణ ప్రాంతాల్లో.. 26 నుంచి 28 వరకు పట్టణ ప్రాంతాల్లో శిక్షణ సివిల్ సర్వీస్ అధికారుల పర్యటనలు- కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ ,సత్యదీపిక ఉదయం :

ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజల జీవన పరిస్థితులు, స్థానిక సమస్యలపై క్షేత్రస్థాయిలో సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శిక్షణ సివిల్ సర్వీస్ అధికారులకు సూచించారు.2026 ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఫౌండేషన్ కోర్సులో భాగంగా ఈ నెల 22 నుంచి 25 వరకు గ్రామీణ ప్రాంతాల్లో, 26 నుంచి 28 వరకు ఆదిలాబాద్ పట్టణంలో పర్యటనలు నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఆయన



సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ పథకాల అమలు, వారి సమస్యలు, అవసరాలను తెలుసుకోవాలన్నారు. జిల్లాలో విస్తారంగా ఉన్న అటవీ ప్రాంతాల నేపథ్యంలో అటవీ హక్కుల చట్టం అమలు, గిరిజనులకు మంజూరైన పట్టాలు, పీవీటీజీ, కోలాం, తోటి కుటుంబాల గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించాలని సూచించారు.అలాగే చెరువులు, సాగునీటి వనరులు, రైతులు సాగు చేస్తున్న పంటలు, వారి ఆదాయ మార్గాలపై అధ్యయనం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వైద్య కేంద్రాలు, అంగన్‌వాడీలను సందర్శించి విద్య, వైద్య, పోషకాహార సేవల పనితీరును పరిశీలించాలని తెలిపారు.పట్టణ పర్యటనల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. పర్యటనల అనంతరం సమీక్ష నిర్వహించి అధికారుల అనుభవాలు, పరిశీలనలను తెలుసుకుంటామని తెలిపారు. శిక్షణ అధికారులకు జిల్లా యంత్రాంగం అన్ని విధాల సహకరిస్తుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓ రవీందర్, డీపీఓ రమేష్, డీఈఓ మడావి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజలింగు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



మంచిర్యాల,సత్యదీపిక ఉదయం :

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత, ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శనివారం జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ వార్డులో



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్ లతో కలిసి ఇందిరమ్మ భీమా యోజన ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని అమలు చేస్తుందని, రేషన్ కార్డులు కలిగిన అర్హులైన కుటుంబాలు ఈ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ పథకం క్రింద కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో నామినీకి 5 లక్షల రూపాయల భీమా పరిహారం అందించే అవకాశం ఉంటుందని, పథకానికి సంబంధించిన ఇతర ప్రయోజనాలు అర్హత నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు అందుతాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ శిబిరానికి హాజరై తమ వివరాలను నమోదు చేసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను వినియోగించుకోవాలని సూచించారు.మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో గల 6వ వార్డులో యు.ఐ.డి.ఎఫ్. నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ రాజలింగుతో కలిసి పరిశీలించారు. యు.ఐ.డి.ఎఫ్. పథకం క్రింద 14 కోట్ల 70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న సి సి రోడ్లు, మురుగు కాలువలు తదితర అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్దేశిత గడువులోగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ



ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని, పనులు నిర్ణీత ప్రమాణాల ప్రకారం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 5 వార్డు అమరావాది లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి పరిశీలించారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తుందని, ఈ క్రమంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వివరాల నమోదులో పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, ఆహార నాణ్యత, విద్యాబోధన తీరును పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో నిర్వహిస్తున్న గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అగ్గు సాగర్, గోపాల్ రావు, రాజేశ్వరి, ఖలీద్, సంపత్ రెడ్డి, మందమర్రి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సాయి కిరణ్, అసిస్టెంట్ ఇంజనీర్ టి.వినీత్, క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 5, 20 వార్డుల కౌన్సిలర్లు దాముక శిరీష్ రమేష్, కూతురు ప్రభాకర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతకు కళా వేదికలు దోహదం

- విద్యతో పాటు కళలు, క్రీడల్లోనూ రాణించాలి చావరా అకాడమీలో ఘనంగా 'ఫ్యూజన్-2026' సీఎంఐ ఆర్ట్ మీట్ - కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ ,సత్యదీపిక ఉదయం :

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, కళాత్మక ప్రతిభను వెలికితీసేందుకు కళా వేదికలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. చదువుతో పాటు సాంస్కృతిక,కళా,క్రీడా రంగాల్లోనూ విద్యార్థులు రాణించినప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని చావరా అకాడమీలో నిర్వహించిన 'ఫ్యూజన్-2026' సీఎంఐ ఆర్ట్ మీట్ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పుస్తక పఠనానికే పరిమితం కాకుండా తమలోని అభిరుచులు, ప్రతిభను గుర్తించి వివిధ కళారూపాల్లో



నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు.సీఎంఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రాంతీయ స్థాయి కళా వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రూప్ డ్యాన్స్‌లు, జానపద నృత్యాలు అలరించగా, వాల్ పెయింటింగ్, రంగోలి, స్టోన్ ఆర్ట్ విభాగాల్లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సామాజిక అంశాలపై ప్రదర్శించిన మూకాభినయం ఆహూతులను ఆలోచింపజేసింది.సీఎంఐ ఆర్ట్ మీట్‌లో చావరా అకాడమీ (ఆదిలాబాద్), బెల్లంపల్లి సెయింట్ మేరీస్ హైస్కూల్, కామారెడ్డి, ఎల్లారెడ్డిలోని జీవదాన్ హైస్కూల్స్, రాంపూర్, నిర్మల్‌లోని సెయింట్ థామస్ హైస్కూల్స్ విద్యార్థులు పాల్గొని వివిధ పోటీల్లో తమ ప్రతిభను చాటుకున్నారు.సీఎంఐ సంస్థల అధ్యక్షులు రెవరెండ్ ఫాదర్ జిన్స్ థామస్ సిఎంఐ, కార్యదర్శి రెవరెండ్ ఫాదర్ జోబిష్ చాలిల్ సిఎంఐ పర్యవేక్షణలో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఆర్ఎఫ్సీఎల్‌లో అమ్మోనియా గ్యాస్ లీకేజీపై మాక్ డ్రిల్

- అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు మాక్ డ్రిల్స్ కీలకం
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



గోదావరిఖని,సత్యదీపిక ఉదయం :

రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని ఎన్టీపీసీ ఆర్ఎఫ్సీఎల్ (RFCL) పరిశ్రమలో అమ్మోనియా గ్యాస్ లీకేజీ సంభవించిన పక్షంలో చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర రక్షణ, సహాయక చర్యలపై ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్ఎఫ్సీఎల్, ఎన్టీపీసీ,సింగరేణి రెస్క్యూ బృందాల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ప్రమాదకరమైన పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినప్పుడు సకాలంలో, సమర్థవంతంగా స్పందించకపోతే ప్రాణ,ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో భద్రతా సిబ్బంది అనుసరించాల్సిన విధానాలు,ప్రమాద తీవ్రతను నియంత్రించడం, బాధితులను సురక్షితంగా రక్షించడం వంటి అంశాలపై క్షేత్రస్థాయి ప్రాక్టికల్ అవగాహన కల్పించడమే మాక్ డ్రిల్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో వివిధ విభాగాల సిబ్బంది సమన్వయంతో వేగంగా స్పందించే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు.అలాగే భద్రతా ఏర్పాట్లలో ఉన్న లోపాలను ముందుగానే గుర్తించి,వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు.స్థానిక పోలీస్ యంత్రాంగం, పరిశ్రమల భద్రతా విభాగాలు,రెస్క్యూ బృందాలు,ప్రాజెక్టు నిర్వహణ సిబ్బంది మధ్య పరస్పర సమన్వయం మరింత బలోపేతం కావడానికి ఇటువంటి మాక్ డ్రిల్స్ ఎంతగానో దోహదపడతాయని సీపీ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే లక్ష్యంగా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని విభాగాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా, సంసిద్ధంగా ఉండాలని సీపీ సూచించారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ఎన్టీపీసీ ఎస్ఐలు వెంకట స్వామి, స్రవంతి, ఆర్ఎఫ్సీఎల్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు, రెస్క్యూ సిబ్బంది పాల్గొన్నారు.





జిల్లా రోడ్డు భద్రతా కోఆర్డినేటర్

పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అదిలాబాద్ , సత్యదీపిక ఉదయం :

జిల్లాలో జిల్లా రోడ్డు భద్రతా కోఆర్డినేటర్ (DRSC) పోస్టును ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా



కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతా చర్యల పర్యవేక్షణ, సంబంధిత శాఖల మధ్య సమన్వయం కోసం ఈ పోస్టును భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం ఒక పోస్టు ఉండగా, ఎంపికైన అభ్యర్థికి ఏడాది కాలానికి ఒప్పంద ప్రాతిపదికన నెలకు రూ.40 వేల వేతనం చెల్లించనున్నట్లు వెల్లడించారు.ఈ పోస్టుకు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన స్థానిక అభ్యర్థులు మాత్రమే అర్హులు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సివిల్ లేదా మెకానికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. నోటిఫికేషన్ తేదీ నాటికి అభ్యర్థి వయస్సు 45 ఏళ్లకు మించరాదు. సమన్వయం, కమ్యూనికేషన్, డాక్యుమెంటేషన్, సాంకేతిక అంశాల్లో నైపుణ్యం కలిగి ఉండాలన్నారు.జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. విద్యార్హతలు, విద్యా ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. అర్హులైన అభ్యర్థులు నవంబర్ 23 నుంచి 30వ తేదీ వరకు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టర్, ఆదిలాబాద్ కార్యాలయంలో సమర్పించాలి. దరఖాస్తుతో పాటు బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, స్టడీ/బోనఫైడ్ సర్టిఫికెట్లు, స్థానిక నివాస ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఇతర అవసరమైన పత్రాల ధ్రువీకృత ప్రతులను జతపరచాలి. నవంబర్ 30వ తేదీ తర్వాత అందిన దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేశారు. పూర్తి వివరాలు, నోటిఫికేషన్ కోసంhttps://www. adilabad.telangana. gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయ వేళల్లో కలెక్టరేట్‌లోని పెన్‌గంగా భవన్‌లో 'సి' సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కలెక్టర్ రాజర్షి షాకు కృతజ్ఞతలు

అదిలాబాద్ సత్యదీపిక ఉదయం :

రిమ్స్‌లో కవల శిశువులను కోల్పోయిన బోరేకర్ సునీత కుటుంబానికి ఉద్యోగం కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి అండగా నిలిచిన జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు



శనివారం టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.ఈ మేరకు టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి దుర్గం శేఖర్, నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి అభినందించారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి ఉపాధి, సొంతింటి భరోసా కల్పించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పరమేశ్వర్, మేకల జితేందర్, ప్రజ్ఞశీల్, జితేందర్ సోంకాంబ్లె తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గిరిజన మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం
- జిల్లా పాలసీ రీసెర్చ్ కన్వీనర్‌గా సీడం నాగోరావు నియామకం

కొమురం భీమ్ ఆసిఫాబాద్ ,సత్యదీపిక ఉదయం :

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సందీప్ రాథోడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరగెల నాగేశ్వర్ రావు, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాక్ విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోవా విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పాలసీ రీసెర్చ్ కన్వీనర్‌గా సీడం నాగోరావును నియమించారు. అనంతరం పార్టీ నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సవినయంగా స్వీకరిస్తూ, పార్టీ నాయకుల నమ్మకాన్ని నిలబెట్టేలా అంకితభావంతో పనిచేస్తానని సీడం నాగోరావు తెలిపారు. సమావేశంలో పార్టీ బలోపేతం, గిరిజన మోర్చా చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణపై నాయకులు చర్చించారు.



పేద కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా భరోసా
- పథకాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి--రమేష్ బాబు.

బెల్లంపల్లి, నవంబర్ 21, సత్య దీపిక ఉదయం:

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ, కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'ను బెల్లంపల్లి పట్టణంలో ప్రారంభించారు. బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు సుభాష్ నగర్ బస్తీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో కలిసి బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి--రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం, వారి భవిష్యత్తుకు భద్రత కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు వివరించారు. సాధారణంగా జీవిత బీమా పొందాలంటే ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, అయితే ఈ పథకంలో లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా పూర్తి ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. దీనివల్ల ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కూడా జీవిత బీమా భద్రత అందుబాటులోకి వస్తుందని అన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా కుదేలవకుండా బీమా పరిహారం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు, నిత్యజీవిత ఖర్చుల విషయంలో ఇబ్బందులు ఎదురుకాకుండా ఈ పథకం కొంత ఆర్థిక అండగా నిలుస్తుందని తెలిపారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలనే ప్రభుత్వ సంకల్పానికి ఈ పథకం నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని, అర్హులైన కుటుంబాలు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ సూచించారు. ప్రజలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
- సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ జిల్లా అధ్యక్షులు వంగరి ప్రవీణ్.

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :.

సమాచార హక్కు చట్టం--2005 పై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు, అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సమాచార హక్కు రక్షణ చట్టం--2005 సొసైటీ కొమురం భీం జిల్లా అధ్యక్షుడు వంగరి ప్రవీణ్ కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమాచార హక్కు చట్టం సెక్షన్ 5(1), 5(2) ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారులు (పి.ఐ.ఓ), సహాయ ప్రజా సమాచార అధికారులు (ఏ.పి.ఐ.ఓ), అప్పీలేట్ అధికారుల వివరాలను ప్రజలకు తెలిసేలా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా సెక్షన్ 4(4) ప్రకారం ప్రజలకు అవసరమైన సమాచారాన్ని స్థానిక భాషలో, సులభంగా అర్థమయ్యే విధంగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు తమ విధులు, అధికారాలు, సిబ్బంది వివరాలు, నిర్ణయ ప్రక్రియ, ప్రజలకు అందించే సేవలు తదితర 17 అంశాల సమాచారాన్ని స్వచ్ఛందంగా ప్రకటించి ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. అలాగే సెక్షన్ 26 ప్రకారం సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వాలు అవసరమైన ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని వంగరి ప్రవీణ్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి, సామాన్య ప్రజలకు ఆర్టీఐ దరఖాస్తు విధానం, సమాచారాన్ని పొందే హక్కు, అప్పీల్ ప్రక్రియపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకొని, ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని వంగరి ప్రవీణ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చెక్కుల పంపిణీ

పెంబి, సత్యదీపిక ఉదయం :

ప్రతి మనిషి కి జీవిత భీమా అవసరం అని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతిధులు అన్నారు.పెంబి మండలం రాంనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సత్తుగూడ కు చెందిన వెడ్మ భీమ్ రావు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లో జీవిత భీమా చేసుకొన్న పది రోజులకు మరణించగా ఆయన కుటుంబంలోని నామిని కి సంస్థ ప్రతినిధులు రెండు లక్షల ముప్పై అరువేల రూపాయల చెక్కుని అందజేశారు.అనంతరం చదువుకో తెలంగాణ పథకం ద్వారా గత సంవత్సరం పదవ తరగతి లో మండల టాపర్ గా గుగ్గిళ్ల శ్రీజ నిలవగా మండల విద్యాధికారి రామ్ చందర్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకి 10 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మేనేజర్ వినోద్ కుమార్, గ్రామ సర్పంచ్ సత్య నారాయణ స్వామి,డెవలప్మెంట్ ఆఫీసర్ నల్ల దేవేందర్, సేల్స్ ఆఫీసర్స్ గుగ్గిళ్ల భూమేష్,కొండ్ర పోషన్న,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్ సిల్క్ బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం
- సమస్యకు సామరస్యపూర్వక పరిష్కారం చూపాలి
- కావేటి సబితా మనోహర్

కాగజ్‌నగర్ ,సత్యదీపిక ఉదయం :

సర్ సిల్క్ కంపెనీలో పనిచేసిన కార్మికులు ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న చింతగూడ, కోయవాగు, కోసిని ప్రాంతాల కుటుంబాలకు ఇళ్లను ఖాళీ చేయాలని కంపెనీ యాజమాన్యం నోటీసులు జారీ చేయడంతో బాధితులు ఆందోళన



చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కావేటి సబితా మనోహర్ బాధిత కుటుంబాలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబాలు ఎవరూ మనోధైర్యం కోల్పోవద్దని, భావోద్వేగాలకు గురికాకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేద్దామని భరోసా ఇచ్చారు. ఈ సమస్యను రాజకీయాలకు అతీతంగా, మానవతా దృక్పథంతో సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని కోరారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కంపెనీ యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని సూచించారు. అవసరమైతే కంపెనీ యాజమాన్యం, అధికారులు, ప్రజాప్రతినిధులు, బాధిత కుటుంబాలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని అన్నారు. బాధితులకు అవసరమైన న్యాయపరమైన, పరిపాలనా సహాయం అందించడంతో పాటు సమస్య పరిష్కారమయ్యే వరకు వారికి పూర్తి మద్దతుగా నిలుస్తానని కావేటి సబితా మనోహర్ హామీ ఇచ్చారు.

నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల వ్యవహారంలో నాకు ఎలాంటి సంబంధం లేదు
బాధితుడు చిలుముల రవి స్పష్టీకరణ.

బెల్లంపల్లి, నవంబర్ 21, సత్య దీపిక ఉదయం:

బెల్లంపల్లి మండలం బుద్దాకుర్తి గ్రామపంచాయతీలో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల జారీ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కావాలనే తనను ఈ కేసులో ఇరికించారని గ్రామపంచాయతీ కారోబార్, దళిత మాదిగ సామాజిక వర్గానికి చెందిన చిలుముల రవి ఆరోపించారు. శనివారం బెల్లంపల్లిలో మీడియా ఎదుట తన ఆవేదనను వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న తనకు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల జారీ వ్యవహారం గురించి తెలిసిందని, ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న కాంగ్రెస్ నాయకుల పేర్లు బయటపెట్టవద్దంటూ తనపై ఒత్తిడి తెస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని రవి పేర్కొన్నారు. గత మూడు రోజులుగా తాళ్లగురిజాల ఎస్సై తనను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తాను దళితుడిననే కారణంతో ఎస్సై తనను అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరించారని, కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ వెంబడి రాణి భర్త వెంబడి సురేష్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి బత్తుల రవి పేర్లు ఎక్కడా ప్రస్తావించవద్దంటూ ఎస్సై చెప్పారని ఆరోపించారు. బుద్దాకుర్తి గ్రామపంచాయతీలో జరిగిన నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల జారీ వ్యవహారంలో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు బత్తుల రవి, వెంబడి సురేష్‌ల ప్రమేయం ఉందని చిలుముల రవి ఆరోపించారు. ఈ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేకపోయినా కావాలనే తనపై తప్పుడు కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ నాయకుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనకు న్యాయం చేయడంతో పాటు తనపై జరుగుతున్న వేధింపులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఈ విషయంపై త్వరలోనే రామగుండం పోలీస్ కమిషనర్‌ను కలిసి అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు చిలుముల రవి వెల్లడించారు.